సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
ఆదివారం, 16.08.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 286
పేజీలు: 08 వెల: రూ. 5


## కాంగ్రెస్‌ది తుమ్మితే

# ఊడిపోయే ప్రభుత్వం

కేంద్రమంత్రి బండి సంజయ్ ఓపెన్ ఛాలెంజ్!

- పాతబస్తీ భాగ్యలక్ష్మి ఆలయం వద్ద లక్షలాది మందితో సామూహిక వందేమాతరం
- ఎంఐఎం కోటలో సమరం..
- దమ్ముంటే అడ్డుకోండి!



02

## వికసిత్ భారత్ కోసం

# సప్తధార

## 2047 వికసిత్ భారత్ కోసం మోడీ మంత్రాలు

## భారత్ అభివృద్ధికి ఏడు కీలక రంగాలు



- మేక్ ఇన్ ఇండియా నుంచి సాఫ్ట్ పవర్ వరకు..
- భారత్‌ను నడిపించే 7 శక్తులపై ఎర్రకోటపై మోడీ ప్రకటన
- దేశ ప్రగతికి మోడీ కొత్త రోడ్‌మ్యాప్
- స్వయంసమృద్ధి భారత్ కోసం అడుగులు

**ముద్ర డెస్క్:**
భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రసంగం దేశ భవిష్యత్తు ప్రగతికి కొత్త దిశానిర్దేశం చేసింది. 2047 నాటికి 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారత్), స్వయంసమృద్ధి సాధించడమే లక్ష్యంగా, దేశాన్ని నడిపించే ఏడు ప్రాథమిక శక్తులను 'సప్తధార' పేరుతో ఆయన ఆవిష్కరించారు. ఈ ఏడు రంగాలు భారతదేశ రాబోయే ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు చోదక శక్తులుగా నిలుస్తాయని పేర్కొన్నారు.

**1. మాన్యుఫ్యాక్చరింగ్**
మొదటి ధార మాన్యుఫ్యాక్చరింగ్. దేశ తదుపరి వృద్ధి దశకు మాన్యుఫ్యాక్చరింగ్ బలమైన పునాదిగా మోడీ అభివర్ణించారు. కేవలం చిన్న విడిభాగాల తయారీకే పరిమితం కాకుండా సంపూర్ణ ఉత్పత్తుల తయారీపై భారత్ దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ సరఫరా వ్యవస్థలో భారత్‌ను ఒక కీలక భాగస్వామిగా నిలబెట్టేందుకు ధర, నాణ్యత, విస్తృత స్థాయి ఉత్పత్తి అనే మూడు అంశాలపై తయారీదారులు దృష్టి పెట్టాలని సూచించారు. మన ఉత్పత్తులకు ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, ఖచ్చితత్వంతో కూడిన నాణ్యత ఐడెంటిటీగా మారాలని చెప్పారు.

**2. వ్యవసాయం-ఆహార భద్రత**
సప్తధారలో రెండవది వ్యవసాయం, ఆహార భద్రత. దేశ అభివృద్ధి ప్రయాణంలో వ్యవసాయ రంగ ప్రాధాన్యతను నొక్కిచెప్పిన ప్రధాని, ఆర్థిక వృద్ధిలో ఆహార ఉత్పత్తి, వ్యవసాయం ఎప్పటికీ కేంద్రబిందువులుగా ఉంటాయని స్పష్టం చేశారు. సుదీర్ఘకాల ఆహార భద్రతను నిర్ధారించడానికి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసి, ఉత్పాదకతను పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

**3. సాంకేతికత, ఆవిష్కరణలు**
సాంకేతికత, ఆవిష్కరణలు మూడవ ధారగా అభివర్ణించారు. ప్రపంచం డేటా సెంటర్లు, రోబోటిక్స్, సరికొత్త సాంకేతికతల యుగంలోకి అడుగుపెడుతోందని, ఈ రంగాల్లో భారత్ గ్లోబల్ హబ్‌గా మారాలని పిలుపునిచ్చారు. యుపిఐ విజయం ద్వారా భారత్ తన సాంకేతిక సామర్థ్యాన్ని ఇప్పటికే ప్రపంచానికి నిరూపించిందని, మిగతా 02లో









## సంక్షేమమే

# ప్రభుత్వ లక్ష్యం

### తెలంగాణకు రావాల్సిన ప్రతి నీటి బొట్టును సాధిస్తాం

- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం
- వరిసాగులో పంజాబ్ ను దాటేశాం..
- విద్య, సంక్షేమ రంగాల్లో తెలంగాణకు కొత్త దిశ

**ముద్ర, హైదరాబాద్:**
సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం తమది అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గోల్కొండ కోటపై సీఎం జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ.. ఈ ప్రభుత్వ 32 నెలల కృషి ఇప్పుడిప్పుడే కనిపిస్తోందని.. తలసరి ఆదాయంలో టాప్‌లో ఉన్నామన్నారు. వ్యవసాయాన్ని పండగ చేయాలని నిర్ణయించామని తెలిపారు. రైతు బాగుంటేనే.. రాష్ట్రం బాగుంటుందన్న ముఖ్యమంత్రి.. రైతు సంక్షేమం కోసం అనేక పథకాలు చేపట్టామన్నారు. రైతు భరోసా కింద రూ.36వేల కోట్లు పెట్టుబడి సాయం అందించామని చెప్పారు. అలాగే, రైతు సంక్షేమం కోసం రూ.లక్షా 70వేల కోట్లు, రూ.2లక్షల వరకు రైతు రుణమాఫీ చేశామని వివరించారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రికార్డులు సృష్టించిందని తెలిపారు. మిగతా 02లో

## వికసిత్ భారత్

# స్వర్ణాంధ్రే లక్ష్యం

### స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఏపీ సీఎం చంద్రబాబు





- వికాసం నుంచి వైభవం వైపు అడుగులు వేద్దాం
- చేతిలో జెండా.. గుండెల్లో దేశం కోసం అజెండా
- దేశం కోసం ఏం చేయగలనో ఆలోచించాలి
- స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు ఇదే నిజమైన నివాళి

**ముద్ర, అమరావతి:**
మన చేతిలో జాతీయ జెండా ఉండాలి.. మన గుండెల్లో దేశం కోసం బలమైన అజెండా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాజధాని అమరావతిలోని రాయపూడి పరేడ్ మైదానంలో తొలిసారిగా నిర్వహించిన 80వ స్వాతంత్ర్య వేడుకలకు ముఖ్యమంత్రి హాజరై జాతీయజెండాను ఎగుర వేశారు. సీడ్ యాక్సెస్ రోడ్డు మీదుగా స్వాతంత్ర్య వేడుక జరిగే వేదిక వద్దకు సీఎం కాన్వాయ్‌తో పాటు బుల్లెట్ ఎస్కార్టు వచ్చింది. డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఇతర ఉన్నతాధికారులు సీఎంకు స్వాగతం పలికారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం సమర్పించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. తెలుగు మిగతా 02లో

## రాజగోపాల్ రెడ్డి

# వ్యాఖ్యలు నిజమే



- కాంగ్రెస్ అవినీతిపై సొంత ఎమ్మెల్యేలే చెబుతున్నారు
- తెలంగాణ ఏఐసీసీకి ఏటీఎంగా మారింది
- మాటలు కాదు.. అవినీతిపై చర్యలు తీసుకోవాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

02

## దళితులను అణిచివేయడమే

# బీజేపీ లక్ష్యం

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

- బీజేపీలో దళితులు బయటికి రావాలి
- ఉత్తరాఖండ్ ఘటనపై మోడీ, షా క్షమాపణ చెప్పాలి

03



## స్మార్ట్ రేషన్ కార్డులు

# పేదల ఆత్మగౌరవానికి ప్రతీక

బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే..

సంగారెడ్డి సభలో సీఎం రేవంత్

- రైతుల కోసం రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేశాం
- రెండేళ్లలో 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం
- జగ్గారెడ్డి లాంటి నాయకులు తెలంగాణలో లేరు



**ముద్ర న్యూస్, సంగారెడ్డి:**
స్మార్ట్ రేషన్ కార్డు కేవలం ఒక కాగితం కాదని.. పేదల ఆకలి తీర్చే ఆత్మగౌరవమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మిగతా 02లో

## యువకుడి ప్రాణం తీసిన

# కుక్క మూత్ర విసర్జన వివాదం

### కుక్క మూత్ర విసర్జనతో మొదలైన గొడవ

- కత్తితో దాడి చేసిన యువకుడు
- ఘటనాస్థలంలోనే 23 ఏళ్ల శ్రీనాథ్ మృతి
- ఖమ్మం రంగనాయకుల గుట్టలో అర్ధరాత్రి ఘటన

03



## 'కాక్రోచ్' ఖాతాకు

# మళ్లీ ప్రాణం

### సీజేపీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా మళ్లీ పునరుద్ధరణ

- వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే 'ఫైర్'
- 'బ్లడీ కవర్డ్స్'.. మెటాపై సీజేపీ ఫౌండర్ ఫైర్
- ఇన్‌స్టా రికవరీ.. 'స్కూల్ లీక్ కరో'తో సీజేపీ కొత్త రచ్చ

02



## మైనర్ బాలికపై పూజారి

# లైంగిక దాడి.!

### అర్చకుడి అసభ్య ప్రవర్తన



- పూజారిని పట్టుకొని పోలీసులకు అప్పగించిన గ్రామ పెద్దలు, స్థానికులు
- స్థానికుల కంటపడిన పూజారి నిర్వాకం

03

## ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం, 16.08.2026
www.mudranews.in | @mudranews



### కరివేపాకుతో జుట్టుకు మేలు



కరివేపాకులో విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. రోజువారీ ఆహారంలో తీసుకోవడం వల్ల పోషకాలు అందడంతో పాటు జుట్టు ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది.

## వికసిత్ భారత్ కోసం
# సప్తధార

(మొదటి పేజీ తరువాయి)
ఇప్పుడు మరింత పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకోవాలని చెప్పారు. అలాగే నెక్స్ట్–జెన్ టెలికమ్యూనికేషన్‌ను వేగవంతం చేస్తూ, స్వదేశీ 6G సాంకేతికతను దేశంలోని మూలమూలకూ తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.



**4. మౌలిక వసతులు**

నాల్గవ ధారగా మౌలిక వసతులు, 'గతి శక్తి' ద్వారా అనుసంధానాన్ని పెంచడంపై మాట్లాడారు. వ్యాపారాన్ని విస్తరించడానికి, ల్యాజిస్టిక్స్ మెరుగుపరచడానికి, వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి రోడ్లు, హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేల అభివృద్ధి అత్యంత కీలకమని, వాటికి నిరంతరం ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఈ వేగవంతమైన కనెక్టివిటీ సరికొత్త ఆర్థిక అవకాశాలను తెరుస్తుందన్నారు.

**5. రక్షా శక్తి**

ఐదవ ధారగా 'రక్షా శక్తి' నిలిచింది. రక్షణ రంగంలో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, స్వదేశీ తయారీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్ వంటి అత్యాధునిక సైనిక సాంకేతికతలపై ఎక్కువ పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. దేశ ద్రోహ భద్రతను గట్టిగా ఉంచడానికి ఆత్మనిర్భర్ రక్షణ రంగం ఎంతో అత్యవసరమని తెలిపారు.

**6. గ్రీన్ ఎనర్జీ**

ఆరవ ధారగా హరిత ఇంధనాన్ని (గ్రీన్ ఎనర్జీ) ప్రధాని గుర్తించారు. పర్యావరణ పరిరక్షణను కాపాడుతూనే భవిష్యత్తు ఇంధన అవసరాలను తీర్చుకోవడానికి క్లీన్ ఎనర్జీ సాంకేతికతల్లో ఆవిష్కరణలు చాలా ముఖ్యం అని చెప్పారు. పునరుత్పాదక ఇంధన రంగాన్ని విస్తరించడానికి, స్వచ్ఛమైన ఇంధన వనరుల వైపు వేగంగా అడుగులు వేయడానికి కృషి చేయాలన్నారు.

**7. భారత్ సాఫ్ట్ పవర్..**

చివరగా ఏడవ ధారగా భారతదేశం 'సాఫ్ట్ పవర్' ను ప్రధాని ఆవిష్కరించారు. భారత్ సాంస్కృతిక ప్రభావం సరిహద్దులు దాటి విస్తరించిందని చెబుతూ.. యోగా, హస్తకళలు, సినిమాలు, యానిమేషన్, గేమింగ్, డిజిటల్ కంటెంట్, క్రియేటివ్ రంగాలు భారత సాఫ్ట్ పవర్‌కు ప్రధాన స్తంభాలని వెల్లడించారు. భారతదేశ పర్యాటక రంగానికి భారీ అవకాశాలు ఉన్నాయని, విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు మరింత కృషి చేయాలని కోరారు. జాతీయ పార్కులు, సాంస్కృతిక విశేషాలు, వినోద పరిశ్రమ, వేగంగా విస్తరిస్తున్న 'కాన్సర్ట్ ఎకానమీ' పర్యాటకాన్ని బలోపేతం చేయడానికి, భారత్ గొప్ప వారసత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పడానికి అద్భుతమైన వేదికలని మోదీ స్పష్టం చేశారు. ఈ సప్తధార సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, 2047 నాటికి దేశాన్ని సంపూర్ణ స్వయంసమృద్ధి కలిగిన వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

## 2047 నాటికి వికసిత్ భారత్..
# స్వర్ణాంధ్రే లక్ష్యం



(మొదటి పేజీ తరువాయి)
నేల కూడా స్వాతంత్ర్య సమరంలో తనదైన ముద్ర వేసిందన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేళ ఏపీ ప్రజలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితమే మన స్వాతంత్ర్యమని అన్నారు. వారి త్యాగాలకు నిజమైన నివాళి అంటే దేశ భవిష్యత్తును మరింత గొప్పగా నిర్మించడమేనన్నారు. దేశం మనకు హక్కులు, గుర్తింపు, గౌరవం తీసుకొచ్చింది. నా దేశం, నా బాధ్యత అని ముందుకుసాగాలి. దేశం నాకు ఏం చేసిందని కాదు... దేశానికి నేను ఏం చేయగలనని అందరూ ఆలోచించాలని కోరారు. 2047 నాటికి వికసిత్ భారత్.. స్వర్ణాంధ్ర సాకారం చేయాలన్న సమున్నత లక్ష్యంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 100 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకల నాటికి దేశం, రాష్ట్రం స్వాతంత్ర్యం నుంచి సమృద్ధి వైపు... వికాసం నుంచి వైభవం వైపు ముందుకుసాగాలన్నారు. ఈ సంకల్పాన్ని నెరవేర్చుకునేందుకు ఐక్యంగా కలిసి అడుగులు వేద్దామని పిలుపునిచ్చారు.




## స్మార్ట్ రేషన్ కార్డులు
# ఆత్మగౌరవానికి ప్రతీక



(మొదటి పేజీ తరువాయి)
వివరించడంతో పాటు బీజేపీ, బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. పేదలకు నిత్యావసర వస్తువులను అందించేందుకు రేషన్ షాపులను తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని సీఎం అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఏ ఒక్క పేదవాడు ఆకలితో అలమటించకూడదన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ వంటి పథకాల గురించి ఇప్పుడు ఇతర పార్టీలు మాట్లాడుతున్నాయని పేర్కొన్నారు.

**బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే**

బీజేపీ, బీఆర్ఎస్ రెండూ వేర్వేరు కాదని, నాణేనికి బొమ్మా బొరుసులాంటివని రేవంత్ రెడ్డి విమర్శించారు. పేదలకు సన్నబియ్యం అందించాలన్న ఆలోచన ఈ రెండు పార్టీలకు ఎప్పుడైనా వచ్చిందా అని ప్రశ్నించారు. ప్రతి పేద ఇంటికి సన్నబియ్యం చేరుస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంటు ఉండదని గతంలో విమర్శలు చేశారని, కానీ 32 నెలల పాలనలో ఏ ఒక్క క్షణమైనా విద్యుత్ సరఫరా నిలిచిందా అని ప్రశ్నించారు. ప్రతి పల్లెలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్నామని, రైతు భరోసా కింద ఏడాదికి రూ.12 వేల చొప్పున అందిస్తున్నామని తెలిపారు.

**రైతుల కోసం రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు**

రైతు భరోసా పథకం ద్వారా రూ.36 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని సీఎం వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.21 వేల కోట్లు ఖర్చు చేసి రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ చేశామని అన్నారు. 32 నెలల్లో రైతులు పండించిన ధాన్యానికి రూ.90 వేల కోట్లు వారి ఖాతాలకు బదిలీ చేశామని తెలిపారు. రైతులకు చేసిన మేలు, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అన్యాయంపై శాసనసభలో చర్చకు రావాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సవాల్ విసిరారు. రెండున్నరేళ్లలో రైతుల కోసం రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేశామని గర్వంగా చెబుతున్నానని పేర్కొన్నారు.

**రెండేళ్లలో 7 లక్షల ఇళ్లకు మంజూరు**

డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని గతంలో చెప్పిన వారు ఒక్కరికైనా ఇచ్చారా అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తాను ప్రజలకు తమ్ముడిలా ఉంటూ రెండేళ్లలో 7 లక్షల ఇళ్లను మంజూరు చేశానని చెప్పారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతోందని, తెలంగాణలో ఇందిరమ్మ ఇల్లు లేని గ్రామం లేదని, ఇకపై ఉండదని అన్నారు. ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులకు పెన్షన్లు అందించే బాధ్యత ప్రభుత్వానిదేనని చెప్పారు. అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**1.70 లక్షల ఉద్యోగాలే లక్ష్యం**

రెండున్నరేళ్లలో 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని సీఎం తెలిపారు. మరో 10 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామని చెప్పారు. నిరుద్యోగ యువత మాయమాటలు చెప్పే వారి ఉచ్చులో పడకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ప్రతి ఆరు నెలలకు ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై క్షుద్ర పూజలు చేస్తున్నారంటూ వ్యాఖ్యలు ప్రభుత్వంపై కొంతమంది అఘోరా పూజలు, చేతబడులు చేస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రజలపై ఎవరైనా చేతబడులు చేస్తారా అని ప్రశ్నించారు. నిజాలు మాట్లాడితే తమ పార్టీ నేత మహేష్ గౌడ్‌కు నోటీసులు ఇస్తున్నారని అన్నారు. ప్రత్యర్థులు ఎన్ని క్షుద్ర పూజలు చేసినా దేవుడి ఆశీర్వాదం తమపై ఉందని వ్యాఖ్యానించారు.

**జగ్గారెడ్డిపై ప్రశంసలు**

సంగారెడ్డిలో జగ్గారెడ్డి పోటీ చేయాలా వద్దా అనేది ఆయన చేతిలో కూడా లేదని, అది కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిర్ణయమని రేవంత్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ రాముడు అయితే జగ్గారెడ్డి హనుమంతుడి లాంటి వారని, రాముడి మాటను హనుమంతుడు ఎప్పుడూ జవదాటడని వ్యాఖ్యానించారు. రూ. 100 కోట్లు ఖర్చు పెట్టినా జగ్గారెడ్డి లాంటి నాయకులు దొరకరని అన్నారు. ఎన్నికల్లో ఓడిపోయినా కుటుంబాన్ని వదిలి ప్రజలతోనే ఉంటున్నారని ప్రశంసించారు. తెలంగాణలో జగ్గారెడ్డి లాంటి నాయకుడు లేరని, అలాంటి నాయకులు ప్రజా జీవితంలో ఉండాలని, ఆయనకు ప్రజలు అండగా నిలవాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నామని, 2034 వరకు ప్రజల ఆశీర్వాదం తమపై ఉండాలని సీఎం ఆకాంక్షించారు.

# సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)
కృష్ణా–గోదావరి జలాల్లో రాజీపడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తెలంగాణకు రావాల్సిన ప్రతి నీటి బొట్టును సాధించి తీరుతామన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేసి రైతుల కళ్లల్లో ఆనందం చూస్తామన్నారు. త్వరలోనే పాలమూరు పూర్తి చేసి నీరందిస్తామని తెలిపారు. వ్యవసాయంతో పాటు ఇళ్లకు ఉచిత కరెంట్ ఇస్తున్నామని, కల్యాణలక్ష్మి కింద ఆడబిడ్డలకు రూ.4,790 కోట్లు అందజేశామని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో ఉన్నామని చెప్పుకొచ్చారు. 15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని, 2 విడతల్లో 5.50లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్లు నిర్మించి అందించనున్నామని తెలియజేశారు.



దేశంలోనే తొలిసారి తెలంగాణలో కులగణన జరిగిందని.. తెలంగాణ ఒత్తిడి వల్లే కేంద్రం జనగణనలో కులగణన చేర్చిందని తెలిపారు. కొత్తగా 2.50లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేస్తున్నామన్నారు. సినీ కార్మికుల సంక్షేమం కోసం త్వరలో బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. విద్యా సూచీలో 21 నుంచి 14వ స్థానానికి తెలంగాణ చేరిందని రేవంత్ తెలిపారు. నియోజకర్గానికొక ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాన్ని చేపట్టామన్నారు. స్కూళ్లలో అల్పాహారం, మధ్యాహ్న భోజనం పెడుతున్నామని, 100కు పైగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు నిర్మించే యోచనలో ఉన్నామని చెప్పారు. అక్రమాలు జరగకుండా TGPSCని ప్రక్షాళన చేశామన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## రాజగోపాల్ రెడ్డి
# వ్యాఖ్యలు నిజమే

**ముద్ర, హైదరాబాద్ :**
తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు హాట్ టాపిక్ గా మారాయి. సొంత పార్టీని, ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చకు దారి తీశాయి. ఈ నేపథ్యంలో రాజగోపాల్ రెడ్డికి మద్దతుగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిటెండ్ కేటీఆర్ ముందుకు రావడం ఆసక్తిగా మారింది. తాజాగా మీడియాతో మాట్లాడిన కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు వేల కోట్ల అవినీతికి పాల్పడుతున్నారన్న రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు నిజమేనని, కోమటిరెడ్డి వ్యాఖ్యలతో తాను పూర్తిగా నేను ఏకీభవిస్తున్నానని కేటీఆర్ అన్నారు. పేదవాడికి ఇల్లు కట్టుకోవడానికి రూ. 5–6 లక్షలు ఇవ్వడానికి 500 నిబంధనలు పెట్టారని విమర్శించారు.

**మాటలు సరే చర్యలేవి?**

తెలంగాణ కాంగ్రెస్‌ను రాహుల్ గాంధీ, ఏఐసీసీకి ఏటీఎంగా మార్చుకున్నారని తెలంగాణలో అవినీతి ఏ స్థాయిలో ఉందో సొంత పార్టీ ఎమ్మెల్యేలే బహిరంగంగా చెబుతున్నారన్నారు. తెలంగాణకు వచ్చిన ప్రతిసారీ రాష్ట్రం ఏఐసీసీకి ఏటీఎంగా మారిందని ప్రధాని మోడీ చెబుతున్నారని మరి అలాంటప్పుడు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని నిలదీశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఈడీ దాడి చేసినా ఆ తర్వాత ఎలాంటి చర్యలు లేవన్నారు. ప్రజాస్వామ్యంలో ఆత్మగౌరవంపై దాడి జరిగితే యువత తిరగబడుతుందని.. ధైర్యంగా నిలబడిన NALSAR యువతకు సెల్యూట్ అన్నారు. విద్యార్థులు – న్యాయవ్యవస్థ మధ్య సంబంధాన్ని గుర్తించిన CJI జస్టిస్ సూర్యకాంత్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి ఘటనలు ఇకపై పునరావృతం కాకూడదని కోరుకుంటున్నానన్నారు.

# కాంగ్రెస్‌ది తుమ్మితే ఊడిపోయే ప్రభుత్వం

**ముద్ర, హైదరాబాద్**
కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఇటీవల తెలంగాణ ప్రభుత్వం, కాంగ్రెస్ నాయకత్వం, ప్రతిపక్ష విధానాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశాభివృద్ధికి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వివరిస్తూనే.. రాష్ట్రంలోని కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం పార్టీల తీరును ఆయన తప్పుబట్టారు. తెలంగాణ ప్రజలకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.ఎర్రకోటపై నుంచి ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను బండి సంజయ్ హర్షించారు. దేశంలో కోటి మంది యువతకు ఉచితంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శిక్షణ అందించడం, పోటీ పరీక్షల కోసం ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ సౌకర్యం కల్పించడం గొప్ప పరిణామమన్నారు. తెలంగాణ యువత పక్షాన ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. రోజ్ గార్ మేళా ద్వారా ఇప్పటివరకు 12 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కుతుందని స్పష్టం చేశారు.
అసెంబ్లీలో గతంలో వందేమాతర గీతాలాపనను ఎంఐఎం బహిష్కరించడాన్ని, దానికి కాంగ్రెస్ మద్దతు తెలపడాన్ని సంజయ్ తీవ్రంగా ఖండించారు. ఇకపై వందేమాతరాన్ని అవమానించే వారిని దేశద్రోహులుగా పరిగణిస్తామని, నిబంధనల ప్రకారం 3 ఏళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా కూడా తప్పదని హెచ్చరించారు. పాతబస్తీలోని భాగ్యలక్ష్మి ఆలయం వద్ద లక్షలాది మందితో వందేమాతరం గీతాలాపన చేయిస్తామని, ధైర్యం ఉంటే ఎంఐఎం నేతలు అడ్డుకోవాలని సవాల్ విసిరారు.

**ఉచిత రేషన్ బియ్యం.. కాంగ్రెస్ తీరుపై విమర్శలు**

రేషన్ కార్డులపై కేంద్రం ఇస్తున్న సహకారాన్ని దాచిపెడుతూ సీఎం, మంత్రుల ఫోటోలు వేసుకోవడంపై ఆయన మండిపడ్డారు. తెలంగాణలోని 57 లక్షల కార్డుదారులకు ఉచితంగా రేషన్ బియ్యం అందిస్తోంది కేంద్ర ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. 'సొమ్ము ఒకడిది.. సోకు ఇంకొకరిదా?' అని ప్రశ్నిస్తూ.. ధైర్యం ఉంటే మోదీ బియ్యం వద్దని కేంద్రానికి లేఖ రాయాలని డిమాండ్ చేశారు. కర్ణాటక తరహాలోనే ఇక్కడ కూడా స్మార్ట్ కార్డుల పేరిట ప్రజాధనం వృథా చేస్తున్నారని ఆరోపించారు.

**కేంద్ర నిధులు.. రాష్ట్ర ప్రభుత్వాల డ్రామాలు**

గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కేంద్ర నిధులను తమ ఖాతాలో వేసుకుంటోందని సంజయ్ విమర్శించారు. పంచాయతీల అభివృద్ధికి, పీఎంఏవై ఇళ్లకు కేంద్రం నిధులిస్తే.. తామే ఇస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. తెలంగాణలో జనాభాతో సంబంధం లేకుండా అక్రమంగా కార్డులు ఇస్తున్నారని, ఆదాయ పన్ను చెల్లించే వారికి కూడా రేషన్ బియ్యం ఇస్తున్నారా అని ప్రశ్నించారు.



## 'కాక్రోచ్' ఖాతాకు
# మళ్లీ ప్రాణం

**ముద్ర, ముంబై :**
కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా కొద్దిసేపు కనిపించకుండా పోయి.. మళ్లీ పునరుద్ధరించబడింది. స్వాతంత్ర్య దినోత్సవం రోజున తమ ఖాతా బ్లాక్ కావడంపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తీవ్రంగా స్పందించారు. ఎక్స్ వేదికగా మెటాపై విమర్శలు గుప్పిస్తూ 'బ్లడీ కవర్డ్స్' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తమ గొంతు నొక్కేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించిన దీప్కే.. ఖాతా బ్లాక్ అయినట్లు చూపించే స్క్రీన్‌షాట్లను కూడా షేర్ చేశారు. అయితే కొద్దిసేపటికే సీజేపీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా తిరిగి అందుబాటులోకి వచ్చింది. దీంతో తమ సోషల్ మీడియా కార్యకలాపాలను ఎవరూ అడ్డుకోలేరంటూ సీజేపీ ప్రకటించింది.
మరోవైపు, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మహారాష్ట్రలోని హింగోలి జిల్లా సంతుక్ పింప్రి గ్రామంలో 'స్కూల్ ఠీక్ కరో' ప్రచారాన్ని సీజేపీ ప్రారంభించింది. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలనే డిమాండ్‌తో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పార్టీ తెలిపింది. మొత్తంగా ఇన్‌స్టాగ్రామ్ ఖాతా వివాదం, కొత్త ప్రచారంతో సీజేపీ మరోసారి సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 16.08.2026
www.mudranews.in | @mudranews



### పుదీనా ఆకులతో నోటి ఆరోగ్యం

పుదీనా ఆకులు నమలడం వల్ల నోటి దుర్వాసన తగ్గించుకోవచ్చు. పుదీనాలోని సహజ సువాసన నోటి ఫ్రెష్‌నెస్‌కు దోహదపడుతుంది.



# దళితులను అనిచివేయడమే బిజెపి లక్ష్యం..

**- ఉత్తరాఖండ్ ఘటనపై మోడీ అమిత్ షా క్షమాపణ చెప్పాలి**
**- బిజెపిలో ఉన్న దళితులు బయటికి రావాలి**
**- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర, కరీంనగర్:** మతోన్మాద బిజెపి పార్టీ దేశంలోని దళితులను అణిచివేయాలని లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. కరీంనగర్ రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే మదనపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షు లు మల్లికార్జున కార్గే ఉత్తరాఖండ్ పర్యటనలో భాగంగా బహిరంగ సభ అనంతరం బిజెపి దాని అనుబంధ సంస్థ ఆర్ఎస్ఎస్ నాయకులు బహిరంగ సభ స్థలాన్ని గంగాజలంతో చేయడానికి శుద్ధి చేయడాన్ని మంత్రి తప్పు పట్టారు. దేశంలో ని దళితులను అణిచివేయడం లక్ష్యంగా బిజెపి ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి ఆరోపించారు.

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా ఉన్న మల్లికార్జున ఖర్గే సంఘటన పై ఇప్పటివరకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పందించ లేదని ఎందుకు బాధ్యులైన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మంత్రి ప్రశ్నించారు. అట్టడుగు వర్గాల విషయంలో గతంలో అనేక సందర్భాల్లో బిజెపి ప్రభుత్వం ధోరణి అర్థమైందని మంత్రి అన్నారు. కేంద్ర హోం శాఖ మంత్రిగా ఉన్న అమిత్ షా పార్లమెంటులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఏకవచనంతో సంబోధించారని మంత్రి లక్ష్మణ్ కుమార్ గుర్తు చేశారు.

ఉత్తరాఖండ్ సంఘటనపై హోం శాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. విచారణ జరిపించి బాధ్యులైన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. బహిరంగ సభ స్థలాన్ని శుద్ధి చేసిన సంఘటనపై కేంద్రమంత్రిగా ఉన్న బండి సంజయ్ నిజామాబాద్ ఎంపీ అరవింద్ లు స్పందించాలని మంత్రి డిమాండ్ చేశారు. దళితులకు వ్యతిరేకంగా ఉన్న బిజెపి పార్టీకి బుద్ధి రావాలంటే బీజేపీ పార్టీలో ఉంది దళిత నాయకులు బయటకి రావాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులపై మోడీ బొమ్మ ముద్రించాలని బిజెపి చేస్తున్న డిమాండ్ పై మంత్రి లక్ష్మణ్ కుమార్ స్పందించారు. కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల కోట్ల రూపాయల పన్నులు జీఎస్టి రూపంలో చెల్లిస్తుందని కేంద్ర ప్రభుత్వ పథకాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటో పెట్టాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు.

తెలంగాణ రాష్ట్రం అధిక పన్నుల చెల్లించినప్పటికీ ఆ పద్ధతిలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు ఇవ్వడం లేదని ఆంధ్రాకు అధిక నిధులు మంజూరు చేస్తున్నారని మంత్రి ఆరోపించారు.

కరీంనగర్ జిల్లా పార్టీ అధ్యక్షులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కోట్లాదిమంది దళిత బహుజనులను మోడీ ప్రభుత్వం అవమానించింది అన్నారు. ఉత్తరాఖండ్ సంఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలోని 70 లక్షల మంది దళితులను అవమానించినట్లు ఉందని ఎందుకు బాధ్యులపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

## యువకుడి ప్రాణం తీసిన కుక్క మూత్ర విసర్జన వివాదం

**ముద్ర, ఖమ్మం :** కుక్క మూత్ర విసర్జన వివాదం ఓ యువకుడి ప్రాణం తీసింది. ఈ ఘటన ఖమ్మం నగరంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానిక త్రీటౌన్ సీఐ మోహన్ బాబు కథనం ప్రకారం... డెకరేషన్ పనులు చేసే ఉండేటి శ్రీనాథ్ (23) నగరంలోని రంగనాయకుల గుట్టలో తన అమ్మమ్మ వద్ద ఉంటున్నాడు. అతడి తల్లి నాగమణి కేసీఆర్ టవర్స్ లో నివసిస్తోంది. శ్రీనాథ్ గురువారం అర్ధరాత్రి తన స్నేహితుడు వీరేశ్ తో కలిసి అతడి ఆటోలో కూర్చుని ఉన్నాడు. అక్కడే నివసించే వేముల మధు అనే యువకుడు పెంపుడు కుక్కతో బయటకు వచ్చాడు. ఆ శునకం వీరు కూర్చున్న ఆటో వద్ద మూత్ర విసర్జన చేయడంతో వివాదం చెలరేగి... మధు, శ్రీనాథ్ లు ఒకరిపైఒకరు దాడి చేసుకున్నారు. ఈ క్రమంలో మధు తన ఇంట్లోకి వెళ్లి కత్తి తీసుకొచ్చి శ్రీనాథ్ పై విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడ్డ శ్రీనాథ్ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికులు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే శ్రీనాథ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్ స్పెక్టర్ వివరించారు.

## ఆలయంలో మైనర్ బాలికపై పూజారి లైంగిక దాడి.!



**ముద్ర, హైదరాబాద్ :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ ఘటన రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆలయ ప్రాంగణంలో బాలికతో ఓ వృద్ధుడు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న విషయాన్ని స్థానికులు గుర్తించడంతో అసలు బండారం బయటపడింది. స్థానికుల సమాచారం ప్రకారం.. ఆలయానికి బయట నుంచి తాళం వేసి ఉండగా, లోపల బాలికతో ఓ వ్యక్తి అనుచితంగా ప్రవర్తిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే అప్రమ త్తమైన స్థానికులు ఆలయం వద్దకు చేరుకుని తలుపులు తెరిచి అతడిని పట్టుకున్నారు. ఆల యంలో అర్చకుడిగా పనిచేస్తున్న సాయన్న అనే వృద్ధుడే ఈ ఘటనకు పాల్పడినట్లు స్థానికులు పేర్కొన్నారు.ఘటనను గుర్తించిన గ్రామ పెద్దలు, స్థానికులు అతడిని పట్టుకుని వెంటనే పోలీసులకు సమాచారం అందిం చారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఘటనపై వివరాలు సేకరించారు. ఆ తర్వాత కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఆలయ ప్రాంగణంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని కూడా స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై కూడా పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

## యువ క్రికెటర్ మృతి

**ముద్ర, వరంగల్ న్యూస్ :** వరంగల్ జిల్లా కరీమాబాద్‌కు చెందిన యువ క్రికెటర్ విశ్వనాథ్ వైష్ణవ్ (21) మృతి చెందారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. కరీమాబాద్‌కు చెందిన ఓం ప్రకాశ్, సునీత దంపతులు కిరాణ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. వారికి కుమారుడు విశ్వనాథ్ వైష్ణవ్, కూతురు చైతన్య సంతానం. పిల్లలను క్రికెటర్లుగా చూడాలని తండ్రికి బలమైన కోరిక ఉండేది. పాఠశాల స్థాయి నుంచి వైష్ణవ్, చైతన్య క్రికెట్‌లో రాణించారు. ఆల్‌రౌండర్ అయిన వైష్ణవ్ ఇటీవల జరిగిన టీజీ20 లీగ్‌లో వరంగల్ వారియర్స్ జట్టులో సభ్యుడిగా ఉన్నారు. గత నెల 26న రాత్రి ఉప్పల్ స్టేడియానికి నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ప్రతినిధులు సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మరణించారు. విశ్వనాథ్ అంత్యక్రియలు శనివారం రాత్రి జరగ్గా.. స్థానికులు, క్రికెటర్లు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

# తెలంగాణ క్రీడాకారులు ముందంజలో ఉండాలి

**స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనీ బాలాదేవి**
**ఎల్బీ స్టేడియంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు**



**ముద్ర, హైదరాబాద్ :** ఎనిమిదవ ఎడిషన్ ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026తో పాటు రానున్న అన్ని జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి గర్వకారణంగా నిలవాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డా. ఏ. సోనీ బాలాదేవి ఆకాంక్షించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో శనివారం ఎల్బీ స్టేడియంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, క్రీడాభిమానులు, తల్లిదండ్రులు, కోచ్‌లు, స్పోర్ట్స్ అథారిటీ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. ఏ. సోనీ బాలాదేవి జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ జెండాకు వందనం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీడాకారులకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026లో తెలంగాణ క్రీడాకారులు అన్ని విభాగాల్లో అగ్రస్థానంలో నిలిచేలా కృషి చేయాలని ఆమె అన్నారు. అలాగే భవిష్యత్తులో జరిగే అన్ని క్రీడా పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు అత్యుత్తమ స్థాయిలో రాణించి రాష్ట్ర ఖ్యాతిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు.

క్రీడల్లో ప్రతిభను గుర్తించి, క్రీడాకారులను ప్రోత్సహించడంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఎల్లప్పుడూ ముందుంటుందని డా. సోనీ బాలాదేవి తెలిపారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం, శిక్షణ, సహకారం అందిస్తూ వారి ప్రతిభను మరింతగా వెలికితీసేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీమతి అనిత, డిప్యూటీ డైరెక్టర్లు రవితేజ, రవీందర్, శ్రీనివాస్, అశోక్ కుమార్, ఇంజనీర్ శ్రీనివాస్, అకౌంట్స్ ఆఫీసర్ శిరీష, అసిస్టెంట్ డైరెక్టర్లు కే.ఆర్. బట్టార్, అశ్విని దద్వే, ఇతర అధికారులు, సిబ్బంది, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## బ్రిటన్ రాజు భారతీయులకు క్షమాపణ చెప్పాలి

**- కల్వకుంట్ల కవిత**



**ముద్ర, హైదరాబాద్:** బ్రిటిష్ పాలనలో భారతీయులపై జరిగిన అఘాయిత్యాలకు బ్రిటన్ రాజు బహిరంగ క్షమాపణ చెప్పాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బంజారా హిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడారు. బ్రిటిష్ వారు భారతదేశం నుంచి తీసుకెళ్లిన కోహినూర్‌తో పాటు సంపదను తిరిగి ఇవ్వాలని, బ్రిటన్ చరిత్ర పుస్తకాల్లో భారత్‌కు సంబంధించిన తప్పుదోవ పట్టించే అంశాలను సరిచేయాలని కోరారు.జలియన్ వాలా బాగ్ ఘటన, కరువులు, ప్రపంచ యుద్ధాల్లో భారతీయ సైనికుల వినియోగం వంటి అంశాలను ప్రస్తావించిన కవిత.. స్వాతంత్ర్య ఉద్యమంలో పూర్వీకుల త్యాగాలను భవిష్యత్ తరాలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. భారత చరిత్ర, సంస్కృతిని కాపాడుకోవడంతో పాటు బ్రిటిష్ పాలన నాటి ఆనవాళ్ల నుంచి బయటపడాల్సిన అవసరం ఉందన్నారు.

# రేవంత్ కు నిరుద్యోగులే గుణపాఠం చెబుతారు

**బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు**



**ముద్ర సిద్దిపేట :** సంగారెడ్డి సభలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. సీఎం తన ప్రసంగంలో సంగారెడ్డి జిల్లాలోని సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టు పనుల గురించి మాట్లాడలేదని విమర్శించారు. అసలు కాంగ్రెస్ ప్రభుత్వంలో సంగారెడ్డి జిల్లాకు ఏం చేశారో చెప్పాలన్నారు. జిల్లాలో ఒక్క కి.మీ రోడ్డైనా వేశారా? అని ప్రశ్నించారు. సిద్దిపేటలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. “బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇచ్చిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి గతంలో అసెంబ్లీలో చెప్పారు. ఇవాళ బీఆర్ఎస్ రేషన్ కార్డులు ఇవ్వలేదని అవాస్తవాలు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం 16వేల ఉద్యోగాలు ఇచ్చిందని అసెంబ్లీలో చెప్పారు. సంగారెడ్డి సభలో 70వేల ఉద్యోగాలు ఇచ్చామని అంటున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి మోసగించారు. అసత్యాలు చెబుతున్న ముఖ్యమంత్రికి నిరుద్యోగులే గుణపాఠం చెబుతారు. రెండేళ్ల నుంచి బకాయిలు ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ఎప్పుడు ఇస్తారు?” అని నిలదీశారు.

## హర్యానాలో 5 కిలోమీటర్ల జాతీయ జెండా ప్రదర్శన



**ముద్ర, ఢిల్లీ :** హర్యానాలోని పల్వాల్‌లో 5 కిలోమీటర్ల పొడవైన భారీ జాతీయ జెండాను ప్రదర్శించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి భారీగా ప్రజలు తరలివచ్చారు. ఇంత పొడవైన జాతీయ జెండాను ప్రదర్శించడం ద్వారా వరల్డ్ రికార్డు నమోదైనట్లు నిర్వాహకులు ప్రకటించారు. దేశభక్తిని చాటు తూ నిర్వహించిన ఈ భారీ కార్యక్రమం పల్వాల్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది....

## ఆటాడే పిల్లల కోసం న్యూ కాన్సెప్ట్



**ముద్ర, హైదరాబాద్ :** 2026, ఆగస్టు 15న భారతదేశమంతా స్వాతంత్ర్య దినోత్సవాన్ని దేశభక్తితో జరుపుకుంది. అయితే అకాన్ హైదరా బాద్ ఈ ప్రత్యేకమైన రోజును ఒక వినూత్న కార్య క్రమం ద్వారా వేడుకలను నిర్వహించింది. అదే ‘అకాన్ ఆహ్వానం 2026’. ‘పే యాజ్ యూ ప్లీజ్’ అనే కాన్సెప్ట్ తో అరిటాకు భోజనం, లైవ్ మ్యూజిక్ కోసం వచ్చే అతిథులకు ఫిక్స్డ్ కాస్ట్, ప్రైజ్ ట్యాగ్ లేకుండా, తాము స్వచ్ఛందంగా, మనసుకు నచ్చి నంత బిల్లును చెల్లించే విధానాన్ని తీసుకొచ్చింది. అయితే ఆ బిల్లులోని ప్రతి రూపాయిని సమాజానికి ఖర్చు చేసేవిధంగా ఏర్పాటు చేసింది అకాన్. అందుకోసం అకాన్ ఆహ్వానం కార్యక్రమాన్ని ఆ సంస్థ ‘ది గుడ్ టాక్ ఫ్యాక్టరీ ఫౌండేషన్’ అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి నిర్వహిస్తోంది. ఈ సంస్థ ఆటిజం పిల్లలకు వివిధ సేవా కార్యక్రమాలు, న్యూరోడైవర్జెంట్ యువతకు స్కిల్ డెవలప్మెంట్ వర్క్ షాపులు నిర్వహిస్తుంటుంది. ఈ సందర్భంగా అకాన్ ఆహ్వానం కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్, ఐఏఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే నటి, విద్యావేత్త దాస్యం గీతా భాస్కర్, టెంపుల్ ఆర్కిటెక్ట్ ఆనంద్ సాయి, యూనిసెఫ్ హైదరాబాద్ ఫీల్డ్ ఆఫీస్ చీఫ్ డాక్టర్ జెలాలెం బిర్హాన్ తఫ్ఫేజ్, జర్నలిస్టులు అంజలి, స్వప్న, నటుడు కాదంబరి కిరణ్ తదితరులు విచ్చేశారు. ఐఏఎస్ జయేశ్ రంజన్ ఇంటెలెక్చువల్లీ చాలెంజ్డ్ పిల్లలతో మంచి సమయాన్ని గడిపారు. అకాన్ ఆహ్వానం 2026 అనే కార్యక్రమం మనకు నిజమైన బాధ్యతను గుర్తుచేస్తోంది. ఇలాంటి పిల్లలకు అందరి చేయూత ఎప్పటికీ ఉండాలి” అని తెలిపారు.

# నేతాజీ నగర్ కాలనీలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**ముద్ర, హైదరాబాద్:** మెహిదీపట్నం సమీపంలోని నేతాజీ నగర్ కాలనీలో శనివారం నాడు స్వాతంత్ర్య దిన వేడుకలు ఘనంగా జరిగాయి. నేతాజీ పార్క్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియే షన్ అధ్యక్షుడు జి అప్పారావు జాతీయ పతాకాన్ని ఆవిష్క రించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు టీఎస్ ఆనంద్ రెడ్డి, ఖాలిద్ సర్వర్, వై నరేందర్ రెడ్డి, ఏ కృష్ణమూర్తి, రమా దేవి, రిటైర్డ్ సూపరింటెండెంట్ ఇంజ నీర్ ( ఎలక్ట్రికల్ ) చంద్రమోహన్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యాన్ని సమపార్జించడంలో అనేక త్యాగాలు చేసిన వారికి నివాళులు అర్పించి వారి మార్గదర్శకత్వంలో నడవ డం మన కర్తవ్యమని అన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులతో పాటు బాధ్యతలను కూడా నిర్వహించినప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ పరిపుష్టమవుతుందని అన్నారు. దేశం గత 80 ఏళ్లలో ఎంతో ప్రగతిని సాధించినప్పటికీ స్వాతంత్ర ఫలాలు ఇంకా అందరికీ పూర్తిగా అందకపోవడం దురదృష్ట కరమని అన్నారు. రాజకీయాలు ధనమయం కావడం విచారకమని పేర్కొంటూ ఆ పరిస్థితి పోవడానికి యువత కృషి చేయవలసిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. దేశ స్వాతంత్ర సము పార్జనకు ప్రాణ త్యాగం చేసిన అమరుల కు, రాజ్యాంగ రూపకర్తలకు వారు పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఎ సత్యం బాబు, కేవీబీ మురళీ మోహన్ రావు, ఎంవీ రంగారెడ్డి, టి సురేందర్ రావు, మహమ్మద్ అబ్దుల్ మాలిక్, పుష్పావతి, ఫక్రుద్దీన్, డాక్టర్ జనార్దన్, పి గంగాధరన్, డాక్టర్ వరప్రసాదరావు, దామోదర్, ఎం అంజనేయస్వామి, విజయ్ కుమార్, శ్రీనివాస్, పి రామేశ్వర్ రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాసరావు, వెంకటరమణ, ఎం రంగ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
ఆదివారం 16.08.2026



మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## తుపాకి నీడ నుంచి..
# పట్టు చీర మడతల్లోకి!

అవి సుక్మా అడవులు... అక్కడ రాత్రులంటే తుపాకుల మోతలు, ఎన్‌కౌంటర్ల భయం. నిమిష నిమిషం మృత్యువుతో పోరాటం. కానీ, కాలం మారింది! చేతులు మారాయి, ఆలోచనలు మారాయి. ఒకప్పుడు అడవి తుపాకీ నీడలో గడిచిన జీవితాలు, నేడు నూతన కాంతుల వైపు అడుగులు వేశాయి. ఆయుధం పట్టిన చేతులు నేడు అందమైన చేనేత వెలుగులను పట్టుకున్నాయి. ఛత్తీస్‌గఢ్ అడవుల్లో హింసను వీడి, జనజీవన స్రవంతిలోకి వచ్చిన మాజీ మహిళా మావోయిస్టులు వేసిన ఆ ఒక్క అడుగు.. నేడు దేశమంతా గర్వించేంత గొప్ప అధ్యాయానికి తెరలేపింది!



### వెలుగుల వేదికపై... విప్లవ ముద్రల వెనక్కి!

రాయ్‌పూర్ నగరం జాతీయ చేనేత దినోత్సవ వేడుకలతో ముస్తాబైంది. కాంతులు విరజిమ్మే ర్యాంప్, కెమెరాల ఫ్లాష్ లైట్లు, ప్రేక్షకుల చప్పట్లు, ఈలల మోతలు... కానీ, అక్కడ నడిచింది ఏ ముంబై మోడల్సో కాదు! బస్తర్ దండకారణ్యం నుంచి బయటకు వచ్చి, హింసను వీడిన తొమ్మిది మంది వీర మహిళలు. ఛత్తీస్‌గఢ్ సంప్రదాయ కోసా సిల్క్ (Kosa Silk) చీరలు ధరించి, గిరిజన కళాకారుల నైపుణ్యాన్ని తమ మేనిపై ప్రదర్శిస్తూ వారు నడుస్తుంటే.. ఆ దృశ్యం చూసిన ప్రతి ఒక్కరి కళ్లు చెమర్చాయి. వారిలో 25 ఏళ్ల పొడియం రాజే ఒకరు. 2018లో మావోయిస్టు పార్టీలో చేరి, సుక్మా అడవుల్లో చేతిలో INSAS రైఫిల్‌తో తిరిగిన రాజే, ఈ ఏడాది మార్చిలో ఆయుధాన్ని వీడి లొంగిపోయారు. "నా జీవితంలో ఇంత నాణ్యమైన, మెరిసే వస్త్రాలను ధరిస్తానని ఎప్పుడూ ఊహించలేదు. మేకప్ అయ్యాక అద్దంలో నన్ను నేనే గుర్తుపట్టలేకపోయాను! మొదట ర్యాంప్‌పైకి రావడం భయమేసింది, కానీ పొందిన శిక్షణ ఇచ్చిన ఆత్మ విశ్వాసంతో చిరునవ్వుతో ముందుకు నడిచాను" అని రాజే భావోద్వేగంగా పంచుకున్నారు.

### ముంబై శిక్షణ... నగరంలో తొలి తొలి అడుగు!



ఛత్తీస్‌గఢ్ హ్యాండ్‌లూమ్ ఫెడరేషన్ నిర్వహించిన ఈ ప్రత్యేక షో కోసం సుక్మాలోని పునరావాస కేంద్రంలో ఉన్న ఈ తొమ్మిది మంది మహిళలకు రాయ్‌పూర్ లో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వీరందరికీ ఒక పెద్ద నగరానికి రావడం ఇదే తొలి సారి! ముంబై నుంచి వచ్చిన ప్రత్యేక స్టైలిస్టులు, మేకప్ ఆర్టిస్టులు వీరికి ర్యాంప్ వాక్, కెమెరాలను ఎదుర్కొనే ఆత్మవిశ్వాసంపై శిక్షణ ఇచ్చారు. పొడియం రాజేతో పాటు మిడియం గంగి, మడవి దేవే, మడవి నాదన్ని, మడవి మాలే, దొడ్డి రమే, మడకం భీమే, పునెం జోయిత్తి, పునెం దేవే వంటి వారు ప్రొఫెషనల్ మోడళ్లకు ఏమాత్రం తీసిపోని రీతిలో ర్యాంప్‌పై మెరిశారు.

### ఇది కేవలం షో కాదు.. మార్పునకు నిదర్శనం!

కార్యక్రమానికి హాజరైన ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి, అసెంబ్లీ స్పీకర్ రమణ్ సింగ్ ఈ మహిళలను నేరుగా కలసి అభినందించారు. లొంగుబాటు అంటే కేవలం ఆయుధం విడిచిపెట్టడం మాత్రమే కాదని, సమాజంతో మమేకమై స్వయం సమృద్ధిగా గౌరవప్రదమైన జీవితం గడపడమేనని ఈ వేడుక చాటిచెప్పింది.

ఒకప్పుడు అడవుల్లో భయాన్ని పంచిన చేతులు... నేడు ప్రశాంతతను, చేనేత సొగసులను ప్రపంచానికి చాటుతూ సోషల్ మీడియాలో నెటిజన్ల మనసులను గెలుచుకుంటున్నాయి. దండకారణ్యం నుంచి ఫ్యాషన్ ర్యాంప్ వరకు సాగిన ఈ మహిళల ప్రయాణం... వెలుగుల వైపు అడుగులు వేయాలనుకునే ప్రతి ఒక్కరికీ ఒక గొప్ప ప్రేరణ!

**- నర్వనేని వెంకట్రావు**



## ఉపవాస నీరసానికి
# వీటితో చెక్..




శ్రావణ మాసం వచ్చిందంటే చాలా మంది భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు, వ్రతాలు పాటిస్తారు. ముఖ్యంగా సోమ, శని, శుక్రవారాల్లో రోజంతా ఉపవాసం ఉండేవారు చాలామంది ఉన్నారు. అయితే ఉపవాసం అంటే పూర్తిగా ఆహారం, నీటిని వదిలేయడం మాత్రమే కాదు. శరీరానికి అవసరమైన ద్రవాలు, పోషకాలు అందేలా ఆహారాన్ని ఎంచుకోవడం. అయితే ఈ సమయంలో కొన్ని ఆహార పదార్థాలతో కొత్త ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అందువల్ల పోషక విలువలు ఎక్కువ ఉండి.. ఎలాంటి అనారోగ్యం కాకుండా ఉండే వాటిని తీసుకోవాలి. వీటిని తీసుకోవడం వల్ల నీరసం రాకుండా సాధారణంగా ఉండగలుగుతారు. మరి అలాంటి ఫుడ్స్ ఏవో చూద్దాం..

### అరటిపండు..

ఉపవాస సమయంలో తీసుకోగల సులభమైన ఆహారాల్లో అరటిపండు ఒకటి. ఇందులో సహజంగా కార్బోహైడ్రేట్లు లభిస్తాయి. ఇవి శరీరానికి శక్తిని అందించడంలో సహాయపడతాయి. ఆకలి, నీరసం అనిపించినప్పుడు ఒక అరటిపండు తినడం వల్ల తక్షణ శక్తి అందుతుంది. అయితే మధుమేహం ఉన్న వారు లేదా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించుకోవాల్సిన వారు తమ వైద్యుడు లేదా డైటీషియన్ సూచనలకు అనుగుణంగా పండ్ల పరిమాణాన్ని నిర్ణయించుకోవడం మంచిది.

### కొబ్బరి నీళ్లు తప్పనిసరిగా..

ఉపవాస సమయంలో నీరు తగ్గిపోవడం వల్ల అలసట, తలనొప్పి వంటి సమస్యలు రావచ్చు. అందుకే కొబ్బరి నీళ్లు మంచి ఎంపికగా ఉంటాయి. ఇవి కూడా మధుమేహం ఉన్నవారు వైద్యుల సలహా మేరకు మాత్రమే తీసుకోవాలి.

### సగ్గుబియ్యం..

శ్రావణ ఉపవాసాల్లో సగ్గుబియ్యం విస్తృతంగా ఉపయోగిస్తారు. సగ్గుబియ్యం ఖిచ్డీ వంటి వంటకాలు శరీరానికి కార్బోహైడ్రేట్లను అందిస్తాయి. అయితే ఎక్కువ నూనెతో తయారు చేసిన సగ్గుబియ్యం వడలు, ఇతర డీప్‌ఫ్రైడ్ పదార్థాలను తరచుగా తినడం మంచిది కాదు. ఉపవాస ఆహారాల్లో ఉడికించడం, ఆవిరితో వండడం, తక్కువ నూనెతో తయారు చేయడం వంటి పద్ధతులు మెరుగైన ఎంపికలుగా సూచించబడుతున్నాయి.

### ఉడికించిన చిలగడదుంప..

చిలగడదుంప ఉపవాస సమయంలో కడుపు నిండుగా ఉంచే మరో ఆహారం. ఇందులో కార్బోహైడ్రేట్లు, కొంత ఫైబర్ ఉండటంతో ఎక్కువసేపు ఆకలి రాకుండా సహాయపడుతుంది. చిలగడదుంపను ఉడికించి లేదా ఆవిరితో వండుకుని తీసుకోవడం మంచిది. అయితే కేవలం చిలగడదుంప వంటి ఆహారాలను మాత్రమే ఎక్కువగా తినకుండా ఇతర పీచు, ప్రోటీన్ వనరులతో కలిపి తీసుకోవడం మంచిది.

### తగినతంత నీరు..

శరీరంలో నీరు తగ్గడం వల్ల కొన్నిసార్లు అలసటగా అనిపించవచ్చు. అందుకే రోజంతా కొద్దికొద్దిగా నీరు తాగుతూ ఉండాలి. నీటితో పాటు కొబ్బరి నీళ్లు, నిమ్మ నీరు వంటి పానీయాలను కూడా తీసుకోవచ్చు. అయితే ఎక్కువ చక్కెర కలిపిన పానీయాలకు దూరంగా ఉండటం మంచిది.

### బాదం, ఖర్జూరాలు..

బాదం వంటి గింజల్లో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్ తదితర పోషకాలు ఉంటాయి. ఖర్జూరాల్లో సహజ చక్కెరలు ఉండటంతో తక్కువ పరిమాణంలో తీసుకుంటే శక్తిని అందించవచ్చు. అయితే ఖర్జూరాలు, డ్రై ఫ్రూట్స్‌ను ఎక్కువగా తినకుండా పరిమిత పరిమాణంలో తీసుకోవడం మంచిది.

### ఆపిల్, దానిమ్మ వంటి పండ్లు..

ఉపవాస సమయంలో ఈ పండ్లను ఆహారంలో చేర్చుకోవడం వల్ల విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ వంటి పోషకాలు అందుతాయి. వీలైనంత వరకు పండ్లను జ్యూస్‌గా కాకుండా నేరుగా తినడం మంచిదని కొందరు ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు.

# మంచి ఉద్యోగి నో ఎందుకు చెప్పాలి?

ఒక సంస్థలో ప్రతి పనిని సమయానికి పూర్తి చేస్తూ.. ఎలాంటి బాధ్యత ఇచ్చినా దానిని తీసుకుని అద్భుతంగా పని చేసే ఉద్యోగులను మేనేజర్లు సాధారణంగా 'బెస్ట్ ఎంప్లాయీస్'గా గుర్తిస్తారు. అయితే ఇదే పేరు కొన్నిసార్లు ఆ ఉద్యోగులకు సమస్యగా మారుతుంది. ఎందుకంటే పని బాగా చేస్తున్నారని తెలిసిన తర్వాత ప్రతి కొత్త పని లేదా అత్యవసర ప్రాజెక్ట్ లేదా ఇతరుల పెండింగ్ పనులు కూడా వారికే అప్పగించే పరిస్థితి ఏర్పడొచ్చు. అంతేకాకుండా మరికొన్ని సమస్యలు కూడా వస్తుంటాయి. ఇలాంటి సమయంలో కొన్నింటికి 'నో' చెప్పాలని నిపుణులు అంటున్నారు. ఎలాంటి పరిస్థితుల్లో చెప్పాలి?

ఒక వ్యక్తికి మంచి ఉద్యోగి అని గుర్తింపు వచ్చిన తరువాత 'నో' చెప్పడం చాలా కష్టమైన పని. నో చెప్పడం అంటే ఆ పని నుంచి తప్పించుకోవడం అని అనుకుంటారు.కానీ కొన్ని సందర్భాల్లో దీనిని చెప్పక తప్పదు. ఒక ఉద్యోగి ఇప్పటికే మూడు ముఖ్యమైన ప్రాజెక్టుల్లో పనిచేస్తుంటే, నాలుగో ప్రాజెక్టును కూడా ఎలాంటి చర్చ లేకుండా అంగీకరించడం వల్ల అన్ని పనుల నాణ్యత దెబ్బతినే అవకాశం ఉంటుంది. అందుకే అవసరమైన సందర్భంలో 'ఇది చేయగలను.. కానీ ప్రస్తుతం ఉన్న పనుల్లో దేనికి ప్రాధాన్యత తగ్గించాలి?' అని మేనేజర్‌ను అడగడం ప్రొఫెషనల్ విధానం.

ప్రతి పనికీ 'ఎస్' చెబుతూ పోతే మొదట్లో మేనేజర్‌కు ఆ ఉద్యోగి అంకితభావంతో కలిగి ఉన్నాడని అనుకోవచ్చు. కానీ కాలక్రమేణా అదే అదనపు బాధ్యతలకు కారణం కావచ్చు. ముఖ్యంగా ఇతర ఉద్యోగులు చేయాల్సిన పనులను కూడా పదేపదే ఆ ఉద్యోగిపై భారం వేయడం వల్ల టీమ్‌లో పని పంపిణీ అసమతుల్యంగా మారుతుంది. హైపెర్ఫార్మర్లను ఎప్పటికప్పుడు ఇతరుల లోటును భర్తీ చేయడానికి ఉపయోగించడం వారి శక్తి, ఉత్సాహాన్ని తగ్గించవచ్చని నాయకత్వ మార్గదర్శకాలు హెచ్చరిస్తున్నాయి.



ఒక ఉద్యోగి నమ్మకంగా.. వేగంగా.. తక్కువ పర్యవేక్షణతో పని పూర్తి చేస్తుంటే.. మేనేజర్‌కు అతనిపై సహజంగానే నమ్మకం పెరుగుతుంది. దీంతో ముఖ్యమైన ప్రాజెక్టులు, క్లిష్టమైన పనులు, అత్యవసర బాధ్యతలు అతనికే అప్పగించే అవకాశం ఉంటుంది. అంతేకాదు, జూనియర్ ఉద్యోగులకు మార్గనిర్దేశం చేయడం, ఇతరుల పనిని చెక్ చేయడం వంటి అదనపు బాధ్యతలు కూడా బెస్ట్ ఎంప్లాయీపై పడొచ్చు. హై పెర్ఫార్మర్లకు వరుసగా కఠినమైన ప్రాజెక్టులు, అదనపు పనులు ఇవ్వడం వల్ల వారు ఓవర్‌లోడ్ అయ్యే ప్రమాదం ఉందని నిపుణుల గైడ్‌లు పేర్కొంటున్నాయి.

ఈ పని ఇతనికి ఇస్తే ఖచ్చితంగా పూర్తి చేస్తాడు అనే నమ్మకం మేనేజర్‌కు ఉండటం మంచిదే. కానీ అదే నమ్మకం కారణంగా ప్రతి పనిని ఒకే ఉద్యోగికి అప్పగించడం మాత్రం ప్రమాదకరం. ఒక దశలో ఆ ఉద్యోగి కొత్త విషయాలు నేర్చుకోవడం కంటే కేవలం పెండింగ్ పనులు పూర్తి చేయడానికే సమయం కేటాయించాల్సి రావచ్చు. దీంతో కెరీర్ గ్రోత్, క్రియేటివిటీ, కొత్త బాధ్యతలు తీసుకునే అవకాశం కూడా తగ్గవచ్చు.

ఇలాంటి సమయంలో ఒక ఉద్యోగి కొత్త పని వచ్చినప్పుడు ఇప్పటికే ఉన్న పనులపై దాని ప్రభావాన్ని అంచనా వేయాలి. అవసరమైతే మేనేజర్‌తో వర్క్‌లోడ్ గురించి ఓపెన్‌గా మాట్లాడాలి. ముఖ్యంగా అదనపు పని వల్ల నాణ్యత, డెడ్‌లైన్ లేదా ఇప్పటికే ఉన్న బాధ్యతలు ప్రభావితమయ్యే పరిస్థితి ఉంటే దాన్ని ముందుగానే చెప్పాలి. మేనేజర్లు కూడా టీమ్ సభ్యుల సామర్థ్యాన్ని తెలుసుకుని, పనిభారాన్ని సమానంగా పంపిణీ చేయాలని నిపుణుల మార్గదర్శకాలు సూచిస్తున్నాయి.

## తెలుగు రాష్ట్రాల్లో
# సంపన్న కుటుంబాలు

భారతదేశంలోని అత్యంత విలువైన 300 కుటుంబ వ్యాపారాల జాబితాలో తెలుగు రాష్ట్రాల (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) కుటుంబాలు గణనీయంగా కనిపిస్తున్నాయి. ఇటీవలి హురున్–బారక్లస్ నివేదిక ప్రకారం, ఈ కుటుంబాలు ఫార్మా, ఇంజినీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో బలమైన స్థానం సంపాదించుకున్నాయి. ఇది తెలుగు ప్రాంతాల ఆర్థిక వికాసం, వ్యాపార వారసత్వం, కొత్త తరం పారిశ్రామికవేత్తల పెరుగుదలను ప్రతిబింబిస్తుంది.

### ఫార్మా రంగంలో ఆధిపత్యం

డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్‌కు చెందిన ప్రసాద్ కుటుంబం సంపన్న జాబితాలో గణనీయమైన స్థానంలో ఉంది. వారి వ్యాపార విలువ దాదాపు రూ.1,13,300 కోట్లు. ఇది హైదరాబాద్‌ను భారత ఫార్మా రాజధానిగా నిలిపింది. అదేవిధంగా, బయోలాజికల్ ఈ డాట్ల కుటుంబం రూ.22 వేల కోట్లు, నవా గ్రూప్ దేవినేని కుటుంబం రూ.17,200 కోట్లు, అమరరాజా బ్యాటరీస్ రామచంద్ర గల్లా కుటుంబం రూ.15,500 కోట్లు కూడా జాబితాలో చోటు దక్కించుకున్నాయి. ఈ కుటుంబాలు ఔషధాలు, వ్యాక్సిన్‌లు, ఆటోమోటివ్ భాగాలు వంటి రంగాల్లో దీర్ఘకాలిక వృద్ధిని సాధించాయి.

### తొలితరం కుటుంబాల ఆధిక్యత

మరో ఆసక్తికర అంశం తొలితరం (ఫస్ట్–జనరేషన) వ్యాపార కుటుంబాల ఆధిక్యత. డివీస్ ల్యాబొరేటరీస్‌కు చెందిన డివీస్ కుటుంబం రూ.1,74,700 కోట్ల విలువతో ప్రాంతీయంగా అగ్రస్థానంలో ఉంది. అరబిందో ఫార్మారెడ్డి కుటుంబం రూ.95,200 కోట్లు, మేఘా ఇంజినీరింగ్ పీపీ.రెడ్డి కుటుంబం రూ.90,100 కోట్లు కూడా టాప్ స్థానాల్లో నిలిచాయి. ఇవి సంప్రదాయ వ్యాపార వారసత్వం లేకుండా, స్వంత కృషితో ఎదిగిన కుటుంబాలు. హైదరాబాద్‌లో ఇలాంటి తొలితరం కంపెనీలు పెరగడం కొత్త వ్యాపార కేంద్రంగా మారుస్తోంది.

### ఆర్థిక ప్రాభవం వెనుక కారణాలు

తెలుగు రాష్ట్రాల్లో ఫార్మా, బయోటెక్, ఇంజినీరింగ్ రంగాలు బలంగా ఉన్నాయి. ప్రభుత్వ విధానాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, అంతర్జాతీయ మార్కెట్‌లకు అనుసంధానం ఈ వృద్ధికి దోహదపడ్డాయి. దేశవ్యాప్తంగా టాప్ 300 కుటుంబాల సంపద గణనీయంగా పెరిగిన నేపథ్యంలో, తెలుగు కుటుంబాలు కూడా ఆ వేగంతో ముందుకు సాగుతున్నాయి. అయితే, సంపద పంపిణీ, ఉపాధి సృష్టి, సామాజిక బాధ్యత వంటి అంశాల్లో ఇంకా అవకాశాలు ఉన్నాయి.

సంపన్నుల జాబితా తెలుగు రాష్ట్రాల వ్యాపార శక్తిని ప్రతిబింబిస్తుంది. ఫార్మా నుంచి ఇన్‌ఫ్రా వరకు విస్తరించిన ఈ కుటుంబాలు ఆర్థిక వికాసానికి దోహదపడుతూనే, భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. స్థిరమైన వృద్ధి, ఆవిష్కరణలు కొనసాగితే, ఈ జాబితాలో మరిన్ని తెలుగు పేర్లు చేరడం ఖాయం.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 16.08.2026
www.mudranews.in | @mudranews



**కరివేపాకుతో పోషకాలు**

విటమిన్ ఏ, సీ, ఈ వంటి పోషకాలు, యాంటీఆక్సిడెంట్లు కరివేపాకులో లభిస్తాయి. కూరలు, పచ్చళ్లు, పొడుల రూపంలో ఆహారంలో చేర్చుకోవచ్చు.



# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవం

**త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**
**దేశభక్తిని చాటిన చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు**

**ముద్ర ప్రతినిధి, ఉమ్మడి రంగారెడ్డి:** కొంగర కలాన్‌లోని రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ఆవరణలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అట్టహాసంగా, పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్ల మధ్య జరిగిన ఈ వేడుకలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.జాతీయ పతాకావిష్కరణ అనంతరం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు, అధికారులు, సిబ్బంది, ప్రజలను కలుసుకుని స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు,సాధించిన ప్రగతిని వివరిస్తూ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రదర్శనస్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖ, హౌసింగ్, సంక్షేమ శాఖలు, పౌర సరఫరాలు, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, అగ్నిమాపక, ఐసీడీఎస్ తదితర శాఖలకు సంబంధించిన శకటాలను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు తిలకించారు.అనంతరం పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, ఉద్యానవన, పౌర సరఫరాలు, విద్యుత్ తదితర శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సేవలను అధికారులు మంత్రికి వివరించారు.ఉత్తమ సేవలకు ప్రశంసాపత్రాలుజిల్లా పరిపాలనలో ఉత్తమ సేవలు అందించిన జిల్లా అధికారులు, సిబ్బందికి, జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ వై. నితిన్, ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ఈ సందర్భంగా ప్రశంసా పత్రాలు అందజేశారు.స్వయం సహాయక సంఘాలకు భారీగా ఆర్థిక సహాయం మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం అందిస్తున్న సహకారంలో భాగంగా గ్రామీణ స్వయం సహాయక సంఘాలకు రూ.261.52 కోట్లు విలువైన చెక్కులను అందజేశారు. అదేవిధంగా మెప్మా పరిధిలోని పట్టణ స్వయం సహాయక సంఘాలకు రూ.18.78 కోట్ల విలువైన చెక్కులను అందజేశారు.మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి కుటుంబ, సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషించేలా ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఈ సందర్భంగా అధికారులు వివరించారు.దేశభక్తిని చాటిన చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలుస్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దేశభక్తి, జాతీయ సమైక్యత, స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రతిబింబించేలా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలుకేజీబీవీ మహేశ్వరం, ఏవీఎన్ ఇంటర్నేషనల్ స్కూల్, టీఎస్ మోడల్ స్కూల్ నేదునూర్, వివేక విద్యా భారతి ఆమనగల్, జడ్పీహెచ్ఎస్ తుక్కుగూడ తదితర విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చారు. చిన్నారులు ప్రదర్శించిన దేశభక్తి గీతాలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు కార్యక్రమానికి ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి. ప్రదర్శనలు ముగిసిన అనంతరం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ ఏ.వి.ఎన్. రెడ్డి, శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, కాలే యాదయ్య, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు డాక్టర్ కె. కిరణ్మయి, చంద్రా రెడ్డి, శంషాబాద్ డీసీపీ బి. రాజేష్, జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవి, కలెక్టరేట్ ఏఓ సునీల్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.






# సైనిక్‌పురిలో ఘనంగా తిరంగా ర్యాలీ

**ముద్ర, మల్కాజిగిరి:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని సైనిక్‌పురిలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అనంతరం నిర్వహించిన తిరంగా ర్యాలీలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్తానిక ప్రజలు ర్యాలీలో పాల్గొని దేశభక్తిని చాటారు.ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ, ఒకప్పుడు విశ్వ గురువుగా నిలిచిన భారతదేశం సనాతన ధర్మం, సంప్రదాయాలకు నిలయమన్నారు. విదేశీ పాలకుల దండయాత్రలు, బ్రిటిష్ పాలనలో భారతీయులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, దేశ స్వాతంత్ర్యం కోసం లక్షలాది మంది తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తుచేశారు.సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, రాజగురు, సుఖదేవ్, అల్లూరి సీతారామరాజు, బిర్సా ముండా, కొమరం భీమ్ వంటి ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛగా మువ్వన్నెల జెండాను ఎగురవేస్తున్నామని అన్నారు. వారి చరిత్రను, త్యాగాలను ప్రస్తుత తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు."త్యాగాలు, చరిత్ర లేకుండా వర్తమానం లేదు. దేశం అంటే కేవలం అభివృద్ధి మాత్రమే కాదు.. దేశం అంటే సంప్రదాయం, విశ్వాసం, ఐక్యతకు ప్రతిరూపం" అని ఈటల రాజేందర్ అన్నారు.కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, కచ్ నుంచి అరుణాచల్ ప్రదేశ్ వరకు భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలు వేరైనా భారతీయులందరినీ మువ్వన్నెల జెండా ఒక్కటిగా నిలబెడుతోందన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేస్తూ, ప్రతి గల్లీ, బస్తీ, గ్రామంలో తిరంగా ర్యాలీలు నిర్వహిస్తున్న ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.సాయి కిరణ్ రెడ్డి నాయకత్వంలో, పార్టీ నాయకుల సమక్షంలో కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. రాబోయే తరాల్లో దేశభక్తి, ఐక్యత, దేశం పట్ల కమిట్‌మెంట్‌ను మరింత బలపరిచే కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా భారత ప్రజానీకానికి, తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా మల్కాజిగిరి ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జనార్దన్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాణిక్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మురిసిన మువ్వన్నెల జెండా..




**ముద్ర, శంకర్ పల్లి :** స్వాతంత్ర దినోత్సవ వేడుకలను శనివారం శంకర్ పల్లి పురపాలిక, మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. శంకర్ పల్లి పురపాలక లో చేవెళ్ళ శాసనసభ్యులు కాలే యాదయ్య జాతీయ జెండా ఎగురా వేశారు. స్వాతంత్ర పోరాటం లో ప్రాణ త్యాగాలు అర్పించిన త్యాగదనులను గురుతు చేశారు. మహనీయులను ఆదర్శం గా తీసుకోని విజయాలు సాధించాలని యువతకు సూచించారు. పేదల అభ్యు న్నతి కి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. మండల పరిధిలో ని అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండా ను ప్రజాప్రతినిధులు, ఆధికారులు ఎగురావేశారు. కార్యక్రమంలో పురపాలిక వైస్ చైర్ పర్సన్ శ్వేత పాండురంగారెడ్డి, మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మెన్ మోహన్,కౌన్సిలర్లు నాయకులు అశోకకుమార్, గోపాల్ రెడ్డి విజయ్, అశోక్, గణేష్, ఆనంద్, కృష్ణ, మోహన్ రెడ్డి, ఎంసాని ప్రకాష్, చంద్రమౌళి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**కూకట్‌పల్లిలో ..**



**ముద్ర, కూకట్‌పల్లి:** కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అల్లాపూర్, మోతీ నగర్, ప్రశాంతి నగర్, కూకట్ పల్లి దయార్‌గూడ, కేపీహెచ్‌బీ రోడ్ నంబర్–1, భారత్ నగర్ మార్కెట్, కైతలాపూర్‌లోని కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, బాలానగర్, ఓల్డ్ బోయినపల్లి, హస్మత్‌పేట్ మరియు కేపీహెచ్‌బీ ఫోరం మాల్ సమీపంలో నిర్వహించిన పలు కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు.ఆయా ప్రాంతాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల స్మారకార్థం నివాళులర్పించారు.

**జనసైనికుల ఆధ్వర్యంలో..**




జనసేన పార్టీ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. మోతీనగర్, గాయత్రీ నగర్, కే పి హెచ్ బి 5వ ఫేస్‌లోని జనసేన పార్టీ కార్యాలయం, బాలాజీ నగర్ డివిజన్ టెంపుల్ బస్ స్టాప్, బాలానగర్, బోయిన్ పల్లి, ఫతేనగర్, భారత్ నగర్ మరియు అల్లాపూర్ డివిజన్లలో ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు.ఈ జాతీయ పండగ వేడుకల్లో కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, వివిధ డివిజన్ల బాధ్యులు, జనసైనికులు మరియు వీర మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**బీజేపీ కార్యాలయంలో..**




బీజేపీ కార్యాలయం వద్ద స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ సీనియర్ నాయకులు సీహెచ్ హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు నాయినేని సూర్యప్రకాష్ రావు జాతీయ జెండాను ఆవిష్కరించి, జెండా వందనం చేశారు.ఈ సందర్భంగా సీహెచ్ హనుమంతరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు చేపట్టిన "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం ద్వారా దేశంలో జాతీయ ఐక్యత, దేశభక్తి భావనలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని, నేటి విద్యార్థులే రేపటి బాధ్యతాయుతమైన పౌరులుగా దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని ఆయన పేర్కొన్నారు.అనంతరం కూకట్‌పల్లిలోని రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు కార్యాలయం వద్ద శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జాతీయ గీతాలాపన, జెండా వందనంలో పలువురు నేతలు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ వేడుకల్లో రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు హర్షణపల్లి సూర్యరావు, నిజామాబాద్ జిల్లా ఇన్చార్జ్ మాధవరం కాంతారావు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావులతో పాటు కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తిని చాటుకున్నారు.

## రెపరెపలాడిన త్రివర్ణ పతాకం



**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** గోల్కొండ తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ నివారణ పథకాన్ని ఎగరవేశారు. గోల్కొండ బోనాల పూజలు నిర్వహించే లంగర్ హౌస్ బుజిలి మహంకాళి దేవాలయంపై ఆలయ చైర్మన్ భోగి బాల్ రాజ్ మువ్వన్నెల జెండాను ఎగరవేశారు. హైదర్ షాకోట్ లో ఆటపాటలతో అందర్నీ అలరిస్తున్న చిన్నారి మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి కూతురు అవంతిక రెడ్డి జెండాను ఎగరవేసి అందరిని ఆకట్టుకుంది.

## విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థికంగా చేయూతనందిస్తా



**ముద్ర, శంకర్ పల్లి :** చదువులో ప్రతిభ కనబరిచె పేద విద్యార్థుల ఉన్నత చదువులకు తగినంత ఆర్థిక సహాయం చేసి చేయూత నందిస్తానని శంకర్ పల్లి మండల కాంగ్రెస్ ఆధ్యాక్షుడు బొల్లారం వెంకట్ రెడ్డి తెలిపారు. పొద్దుటూరు ఉన్నత పాఠశాలలో శనివారం ఆయన స్వాతంత్ర దినోత్సవ వేడుకల అనంతరం గత సంవత్సరం పదో తరగతి లో ఉత్తీర్ణత సాధించిన 15 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున్న రూ.1.50 లక్షల ను అందచేశారు. మహనీయుల జీవితలను ఆదర్శం గా తీసుకోని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని అన్నారు పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల చదువులకు అందిస్తున్న చేయూత అభినందనీయమని గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బండ లక్ష్మి నర్సింహా ఉపసర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, వార్డ్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హెల్త్ కార్డు ప్రారంభించిన పంజుగుల బ్రదర్స్




**ముద్ర ప్రతినిధి, తాండూర్:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పంజుగుల విఠల్ రెడ్డి తాండూర్ పట్టణంలోని వినాయక హాస్పిటల్‌లో కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేక హెల్త్ కార్డును, తాండూర్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీశైల్ రెడ్డి పంజుగులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సిబ్బంది కేక్ కట్ చేసి విఠల్ రెడ్డి గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం పంజుగుల విఠల్ రెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవం, నా జన్మదినం సందర్భంగా నా చేతుల మీదుగా ప్రజలకు ఉపయోగపడే హెల్త్ కార్డును ప్రారంభించడం చాలా సంతోషంగా ఉంది. తాండూర్ ప్రజలకు అందుబాటులో ఉండే ఈ ఆరోగ్య సదుపాయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి అని అన్నారు.ఈ సందర్భంగా శ్రీశైల్ రెడ్డి పంజుగుల మాట్లాడుతూ.. హెల్త్ కార్డు ద్వారా కుటుంబంలోని ఐదుగురు సభ్యులకు ఉచిత వైద్య కన్సల్టేషన్, ల్యాబ్ సేవల్లో 20% డిస్కౌంట్, ఎక్స్‌రే సేవల్లో 0% డిస్కౌంట్, ఫార్మసీలో 10% డిస్కౌంట్ అందిస్తున్నట్లు హాస్పిటల్ నిర్వాహకులు తెలిపారు. తాండూర్ ప్రజలు ఈ ఆరోగ్య సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి ఉపయోగపడే కార్యక్రమాలను ప్రోత్సహించడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తాండూర్ నియోజకవర్గ ముఖ్య నాయకులు, మండల నాయకులు, పలువురు కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీలు రాజకీయంగా ఎదగాలి



**ముద్ర, చేవెళ్ల:** బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్. కృష్ణయ్య ను శనివారం చేవెళ్ళ నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు బండ మీ ది వెంకటేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానం చేసి స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుత రాయకీయాల్లో బీసీల పాత్ర గురుంచి చర్చించి నట్లు తెలిపారు.

## చేవెళ్ల లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు




**ముద్ర, చేవెళ్ల :** చేవెళ్ల నియోజకవర్గ కేంద్రం, మండలాలలోని అన్ని గ్రామాలలో 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో శాసనసభ్యులు యాదయ్య జాతీయ జెండా ను ఎగురావేశారు. ప్రభుత్వం నీరుపేదల అభ్యున్నతి కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాదాని అన్నారు. చేవెళ్ల నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం పాటుపడతానని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పూర్తి వసతులు కల్పించి అభివృద్ధి పరుష్టమన్నారు. నియోజకవర్గం లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో. గ్రామపంచాయతీ లలో ప్రజాప్రతినిధులు. అధికారులు జెండా ఎగురావేశారు. కార్యకమంలో పలు గ్రామాల సర్పంచులు ఉపసర్పంచ్ లు. నాయకులు మంగమ్మ, మహేందర్, దయాకరచారి, శ్రీరాంరెడ్డి, రాఘవేందర్ రెడ్డి, కాంతిరెడ్డి, అనంత్ రెడ్డి, సుభాష్ రెడ్డి, శ్రీనివాస్, రాములు తదీతరులు పాల్గొన్నారు.

**శంకర్ పల్లిలో..**



శంకర్ పల్లి పురపాలక లోని 15 వ వార్డు అయ్యప్ప రెడ్డి గూడా ప్రాథమిక పాఠశాల లో నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలల్లో నందమూరి జానకిరామ్ ట్రస్ట్ చైర్మన్ దీపికా జానకి రామ్ పాల్గొన్నారు. విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంపిణి చేసారు. పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారాలు ట్రస్ట్ అందిస్తుందన్నారు. ప్రధానోపాధ్యాయులు సదా లక్ష్మి, ఉపాధ్యాయులు సునీతా, తాహర్, నాయకులు ప్రవీణ్, మహేష్ విద్యార్థులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## పుదీనాతో జీర్ణక్రియకు మేలు

పుదీనా ఆహారానికి రుచిని పెంచడమే కాకుండా జీర్ణక్రియకు కూడా సహాయపడుతుంది. పుదీనా ఆకులను ఆహారంలో చేర్చుకోవడం మంచి అలవాటు.



# అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు గా ముందుకు..



- జిల్లా సర్వతో ముఖాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి..
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..
- కరీంనగర్ లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మంత్రి..
- జాతీయ పతాక ఆవిష్కరణ.. స్వాతంత్ర్య సమర యోధులకు సన్మానం..
- ఉత్తమ సేవలు అందించిన పలువురు అధికారులకు ప్రశంస పత్రాల అందజేసిన మంత్రి అడ్లూరి..

**ముద్ర, కరీంనగర్:** కరీంనగర్: అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కరీంనగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించారు. ఉత్తమ సేవలు అందించిన పలువురు అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

కరీంనగర్ జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల పురోగతిని మంత్రి వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లులు అందిస్తున్నామని తెలిపారు. రైతుభరోసా కింద రైతులకు పెట్టుబడి సాయం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు.అలాగే ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, విద్యార్థులకు వసతులు కల్పించడంతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. కరీంనగర్ జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, పోలీసు సిబ్బంది,



స్వచ్ఛంద సంస్థలు, జర్నలిస్టులు, ప్రజలు అందిస్తున్న సహకారానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు



**ముద్ర, కరీంనగర్:** శ్రావణ శనివారం సందర్భంగా కరీంనగర్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భం గా ఆలయం అర్చకులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## ప్రజా సంక్షేమానికే డిజిటల్ రేషన్ కార్డులు

**ప్రభుత్వ విప్ వేముల వీరేశం**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ప్రజల సంక్షేమం దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం డిజిటల్ రేషన్ కార్డులను ప్రవేశపెట్టిందని ప్రభుత్వ విప్ వేముల వీరేశం అన్నారు. నిర్మల్ లో శనివారం సాయంత్రం నూతన డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతీ పేద కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు అందాలనే ఉన్నతమైన లక్ష్యంతో ఈ కొత్త డిజిటల్ రేషన్ కార్డుల రూపకల్పన జరిగిందని తెలిపారు. జిల్లాలో మొత్తం 2,49,313 నూతన డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు వివరించారు. పారదర్శకమైన పాలన అందిస్తూ, రేషన్ కార్డును కేవలం బియ్యం పొందేందుకు మాత్రమే కాకుండా, ప్రభుత్వ పథకాలన్నింటికీ ఒక నమ్మకమైన గుర్తింపు కార్డుగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించి ప్రతీ ఇంట్లో వెలుగులు నింపడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సంక్షేమ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అడుగులు వేస్తోందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియను ప్రభుత్వం అత్యంత సులభతరం చేసిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలంతా ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, డిఆర్డిఓ విజయలక్ష్మి, పౌర సరఫరాల అధికారి రాజేందర్, నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ షిండే ఆనంద్ రావు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**కోరుట్ల పట్టణంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు....**



**ముద్ర, కోరుట్ల;** కోరుట్ల పట్టణంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కోరుట్ల నియోజకవర్గ కేంద్రమైన కొత్త బస్టాండ్ వద్ద పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జువ్వాడి కృష్ణారావు, వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద బిజేపీ పార్టీ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షులు కస్తూరి లక్ష్మీనారాయణ, రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీవో జీవాకర్ రెడ్డి, మండల రెవెన్యూ కార్యాలయంలో ఎమ్మార్వో కృష్ణ చైతన్య, మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ తిరుమల వసంత గంగాధర్, పలు ప్రైవేట్, ప్రభుత్వ విద్యా సంస్థలలో జాతీయ జెండాను ఎగుర వేశారు. వారు మాట్లాడుతూ 1857 సిపాయి తిరుగుబాటు సందర్భంలో విరోచితంగా పోరాడి ఝాన్సీ లక్ష్మీబాయి మొదలుకొని వేలాది మంది స్వాతంత్ర సమరయోధులు తమ ప్రాణాలను అర్పించి స్వాతంత్ర్య జ్యోతిని వెలిగించారు. స్వాతంత్రం నా జన్మ హక్కు అని చాటిన లోకమాన్య బాలగంగాధర్ తిలక్ శాంతి అహింసతో స్వాతంత్ర పోరాటాన్ని నవభారత నిర్మాణంలోనూ మహోన్నతమైన పాత్ర పోషించిన తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ, తొలి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ మహోన్నత సాత్వికుడు సంస్కర్త భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి మహానుభావులు సేవలు అందించారని వక్తలు తెలిపారు.



## నలువాల జగన్ కు ఉత్తమ పీఆర్వో అవార్డు



**ముద్ర, కరీంనగర్ :** 80వ స్వాతంత్ర్య వేడుకలు కరీంనగర్ లో ఘనంగా జరిగాయి. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంసపత్రాలు అందజేశారు. డీపీఆర్వో కార్యాలయంలో పీఆర్వో గా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వం ప్రజలకు మధ్య వారధిలా వ్యవహరిస్తూ ప్రభుత్వ పథకాలను ప్రచారం చేస్తూ ఉత్తమ సేవలందించినందుకు గాను నలువాల జగన్ కు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీద అవార్డును బహూకరించారు.

## ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్న సురేష్



**ముద్ర, కోరుట్ల :** మెట్‌పల్లి డివిజన్ కార్యాలయంలో ఆర్టిజన్ గ్రేడ్–II గా విధులు నిర్వహిస్తున్న మోటూరి సురేష్ తన విధుల పట్ల చూపుతున్న నిబద్ధత, అంకిత భావం.. సమర్థవంతమైన సేవలకు గుర్తింపుగా ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్నారు. ఈ అవార్డును టీజీఎన్‌పీడీసీఎల్ జగిత్యాల ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బి. సుదర్శనం చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా మెట్‌పల్లి ఆపరేషన్ డివిజన్ డివిజనల్ ఇంజనీర్ (డీఈ) జి. మధుసూదన్ మోటూరి సురేష్‌ను అభినందించి, విధుల పట్ల ఆయన సేవలను ప్రశంసించారు. అలాగే మెట్‌పల్లి ఆపరేషన్ డివిజన్ సిబ్బంది మోటూరి సురేష్‌కు అభినందనలు తెలియజేసి, ఆయన సాధించిన ఈ విజయంపై హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

**ముద్ర, కోరుట్ల;** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని డబ్బా గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు శనివారం సాయంత్రం ఇబ్రహీంపట్నం ఎస్సై నవీన్ కుమార్ తన సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేయగా డబ్బా, వర్షకొండ, అమ్మక్కపేట మెట్పల్లి ప్రాంతాలకు చెందిన ఏడుగురు వ్యక్తుల వద్ద 8300/– రూపాయల నగదు, పేక ముక్కలను సీజ్ చేసి ఇరువురు వ్యక్తుల పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి. నవీన్ తెలిపారు.

# ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి చేరాలి

**కన్నుల పండువగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు**
**ప్రభుత్వ విప్ వేముల వీరేశం**

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి చేరేలా అధికారులు కృషి చేయాలని ప్రభుత్వ విప్ వేముల వీరేశం అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియం లో కన్నుల పండువగా జరిగాయి. ఈ వేడుకలకు ప్రభుత్వ విప్ వేముల వీరేశం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి వివరాలను ఆయన కూలంకషంగా వివరించారు. అధికారుల పనితీరుతో జిల్లా అన్ని రంగాల్లో ముందు వరుసలో నిలుస్తుందని చెప్పారు. జిల్లా అధికారులు సిబ్బంది మరింత ఉత్సాహంతో పని చేస్తూ, జిల్లా అభివృద్ధికి మరింత కృషి చేయాలని అన్నారు. వేడుకల్లో భాగంగా పాఠశాలల విద్యార్థులచే దేశభక్తి ఉట్టిపడేలా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ విప్, కలెక్టర్, ఎమ్మెల్యేలు కలిసి విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లాలోని పలు శాఖల ఉద్యోగులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందించారు. అవార్డులు ఉత్తమ పనితీరుకు నిదర్శనమని, అవార్డులు లభించిన అధికారులు మరింత ఉత్సాహంతో పనిచేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాలుపంచుకున్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించి, వారిని అభినందించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శకటాల ప్రదర్శనను తిలకించి, స్టాళ్లను వీక్షించారు. జిల్లా మహిళా సంఘాలకు మంజూరయిన





రూ.50 కోట్ల విలువైన చెక్కులను అందజేశారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో అదనపు కలెక్టర్ లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఏఎస్పి సాయి కిరణ్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంబరాన్నంటిన జెండా సంబరాలు

భారత స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా జండా సంబరాలు అంబరాన్ని అంటాయి. పలు కార్యాలయాలు, విద్యాసంస్థల్లో పతాకావిష్కరణ ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ భవేష్ మిశ్రా పతాకావిష్కరణ చేశారు. బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్, మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ కావ్య గణేష్ చక్రవర్తి, పలు ప్రాంతాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్ చక్రవర్తి, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎంఎల్ఏ ఏలేటి మహేశ్వర్ రెడ్డి పతాకావిష్కరణ చేశారు.

# అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**ముద్ర, కరీంనగర్ :** భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమం ప్రపంచంలోని ఎన్నో దేశాలకు ఆదర్శనీయమని.. మార్గదర్శకమని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కరీంనగర్ లోని అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో ఘనంగా నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి భరతమాత మరియు గాంధీజీ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి వారు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. భారతదేశంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతున్నదని ప్రత్యేకంగా వ్యవసాయ రంగంలో, మౌళిక సదుపాయాలలో ముందంజలో నిలుస్తున్నదని తెలుపుతూ ప్రతి ఒక్క విద్యార్థి తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా కృషి చేయాలని మరియు వాటిని సాధించి సమాజంలో అత్యుత్తమ ఖ్యాతిని సొంతం చేసుకోవాలని వారు సూచించారు. ప్రధానమంత్రి వర్యులు నరేంద్ర మోడీ భారత దేశ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తున్నారని .. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యుత్తమ ఫలితాలు సాధిస్తుందని మరియు అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్నదని చెప్పారు.



అల్ఫోర్స్ విద్యా సంస్థలు సైతం ప్రతి సంవత్సరం రెట్టింపు ఫలితాలు సాధిస్తున్న దని.. ప్రముఖ విద్యాసంస్థల్లో విద్యార్థులు సీట్లను సాధిస్తూ అల్ఫోర్స్ ఖ్యాతిని రెట్టింపు చేస్తున్నారని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని చెప్పారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రధానం గా భిన్నత్వంలో ఏకత్వం, పిరమిడ్స్, జాతీయ నాయకుల వేషధారణలు, తదితర నృత్య ప్రదర్శనలు ఆలోచింపజేసింది. అదేవిధంగా వేడుకలను పురస్కరించుకొని నిర్వహించినటువంటి పలు ప్రతిభా పాటవ పోటీలలో పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు మరియు శుభాకాంక్షలు తెలిపారు

ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల, కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 16.08.2026
www.mudranews.in | @mudranews



### కీర దోసకాయతో మలబద్ధకానికి ఉపశమనం

కీరలో ఉండే పీచు, నీటి శాతం మలబద్ధకం నివారణకు సహాయ పడతాయి. రోజువారీ ఆహారంలో భాగంగా తీసుకోవడం మంచిది.



# రెపరెపలాడిన మువ్వన్నెల జెండా













## ప్రజల కోసమే ప్రజా ప్రభుత్వం

**ఉప ముఖ్యమంత్రి భట్టి**
**డిజిటల్ స్మార్ట్ కార్డు పంపిణీ**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** అధికారం చెలాయించడం కోసం కాకుండా ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగానే ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఖమ్మం కలెక్టరేట్ లో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 1.06 కోట్లకు పైగా కుటుంబాలకు నెలకు ఒక్కొక్కరికి 6 కేజీల చొప్పున సన్న బియ్యాన్ని ప్రభుత్వం పూర్తి ఉచితంగా పంపిణీ చేస్తోందని చెప్పారు నిరుపేద కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షలకు పెంచడం జరిగిందని తెలిపారు అర్హులైన పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, అలాగే కొత్తగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం అందిస్తోందని, ఉచిత బస్సు ప్రయాణం కోసం ప్రభుత్వం ఇప్పటివరకు ఆర్టీసీకి రూ. 10,700 కోట్లకు పైగా చెల్లించిందని వివరించారు. ఖమ్మం జిల్లాలోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్తగా 62,158 రేషన్ కార్డులను మంజూరు చేసినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు.దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాకుండా, ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతో తెలంగాణ పోటీపడే స్థాయికి తీసుకెళ్లడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రామదాసు నాయక్, కలెక్టర్ దివాకర టిఎస్,అడిషనల్ కలెక్టర్ శ్రీజ, కార్పోరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, సుడా చైర్మన్ దుర్గాప్రసాద్ తదితర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా సూర్యాపేట అభివృద్ధి

**రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

**ముద్ర, సూర్యాపేట:** సూర్యాపేట జిల్లాను రాజకీయాలకు అతీతంగా సర్వతోముఖాభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం నూతన పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ కె. నరసింహాతో కలిసి మంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను మంత్రి వెల్లడించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు 5.68 కోట్ల ప్రయాణాలు చేసి రూ.343.87 కోట్ల ప్రయోజనం పొందారని తెలిపారు. రూ.500కే గ్యాస్ పథకం కింద 5.52 లక్షలకుపైగా సిలిండర్లు పంపిణీ చేసి రూ.15.26 కోట్ల సబ్సిడీ అందించామన్నారు. గృహజ్యోతి కింద 1.91 లక్షలకుపైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందుతోందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో 12,868 ఇళ్లు కేటాయించగా 7,928 మంజూరయ్యాయని, 6 వేలకుపైగా నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు.రైతు భరోసా కింద 2026-27 వానాకాలంలో 2.90 లక్షలకుపైగా రైతులకు రూ.364 కోట్లకు పైగా జమ చేశామని మంత్రి వెల్లడించారు. నీటి లభ్యతను బట్టి వరికి ప్రత్యామ్నాయంగా కందులు, పెసలు, మినుములు, మొక్కజొన్న, నూనెగింజలు, మిరప, ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్, కూరగాయల సాగును ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.జిల్లాలో సాగునీటి సామర్థ్యాన్ని పెంచేందుకు రూ.1,649 కోట్ల ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ ఎత్తిపోతల పథకం, రూ.292.08 కోట్ల జవహర్ జానపాడు బ్రాంచ్ కెనాల్, రూ.451.42 కోట్ల రాజీవ్ గాంధీ ఎత్తిపోతల పథకాలు కొనసాగుతున్నాయని చెప్పారు. వీటి ద్వారా సుమారు 77 వేల ఎకరాలకు సాగునీటి ప్రయోజనం కలగనుంది.విద్యా రంగంలో 93 ప్రీ-ప్రైమరీ పాఠశాలలు, మూడు నియోజకవర్గాల్లో రూ.600 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, కోదాడలో రూ.53.15 కోట్లతో జవహర్ నవోదయ విద్యాలయం, హుజూర్‌నగర్‌లో రూ.126 కోట్లతో వ్యవసాయ కళాశాల మంజూరయ్యాయని తెలిపారు.వైద్య రంగంలో 65 వేలకుపైగా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించగా, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జనవరి-జూన్ మధ్య 1.41 లక్షలకుపైగా ఓపీ, 29 వేలకుపైగా ఐపీ సేవలు అందించామని చెప్పారు.'తెలంగాణ రైజింగ్-2047' విజన్‌తో వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత, పరిశ్రమలు, ఉపాధి, పర్యావరణం తదితర రంగాల్లో సూర్యాపేటను మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో సమృద్ధమైన సూర్యాపేట, సమగ్ర తెలంగాణ, శక్తివంతమైన భారతదేశ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్వాతంత్ర్య సమరయోధులు గుడిపాటి అంజయ్య, కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, కుక్కడం జానకి రామయ్య, గరిడేపల్లికి చెందిన బండ పుల్లారెడ్డిని మంత్రి, కలెక్టర్ ఘనంగా సన్మానించారు.

## యాదాద్రి భువనగిరిలో..

**జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** 80వ, భారత స్వాతంత్ర్య దినోత్సవము సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో అన్ని ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలలో, విద్యాలయాలలో జాతీయ జెండాలను ఆవిష్క రించారు. జిల్లా కేంద్రంలోని జూనియర్ కాలేజ్ ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని, తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ముఖ్య అతిధి హోదాలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లడుతూ ప్రియమైన స్వాతంత్ర్య సమరయోధులకు, అమరవీరుల కుటుంబ సభ్యులకు, జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, న్యాయమూర్తులకు, అధికారులు, ఉద్యోగులకు, కర్షకులు, కార్మికులు, పాత్రికేయులు, విద్యార్థినీ విద్యార్థులకు 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వివిధ సంక్షేమ పథకాలపై అభివృద్ధిని వివరించారు. దేశభక్తిపై విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ప్రజలను ఎంతగానో ఆకర్షించాయి. విధులలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి , ఎస్పీ అక్షాంశ్ యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, మున్సిపల్ కమీషనర్ శ్రీ వాణి, వైస్ చైర్మన్ మంజుల, గ్రంధాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ ,జడ్పీ సి ఈ ఓ శోభారాణి జిల్లా అధికారులు, అమర వీరుల కుటుంబ సభ్యులు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. పురపాలక సంఘ కార్యాలయంలో... స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా పురపాలక సంఘ కార్యాలయంలో చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవైస్ చిస్తి, వైస్ చైర్ పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ కె చంద్ర ప్రకాష్ రెడ్డి, గౌరవ వార్డు సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు, పుర ప్రముఖులు, నాయకులు సిబ్బంది పాల్గొన్నారు.ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో... తెలంగాణ ఉద్యమ కారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూస శ్రీనివాస్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షులు కొడిమాల కృష్ణ ప్రధాన కార్యదర్శి జంపాల శ్రీనివాస్ రాష్ట్ర అధికార ప్రతినిధులు గొర్ల లక్ష్మణ్ గోపరాజు గణేష్, పట్టణ అధ్యక్షుడు మంతపురి వినోద్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ముదిగొండ మహేందర్ పాల్గొన్నారు.కలెక్టరేట్ ఆవరణలో...80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శనివారం ఐడిఓసి ఆవరణ వద్ద జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ముందుగా కలెక్టర్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి గాంధీజీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు సాత్విక్ , కృతిక, టి.JAC చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి ,కలెక్టరేట్ ఏవో, వివిధ శాఖల జిల్లా అధికారులు, అన్ని శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**ముద్ర, దేవరకొండ:** హోరేబు మినిస్ట్రీస్ కొండ మల్లేపల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలో మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పాస్టర్ ధోనీ సునీలు కుమార్ మాటాడారు. పాస్టర్ ఇమ్మానుయేల్, సంఘపెద్దలు ఏసురత్నం, మురళీకృష్ణ. లోవరాజు, శాంసన్, హోసన్నా, రూబెన్, జాషువా,స్టీఫెన్,నెహెమ్యా, జగన్, శాంతి కుమార్, నాతనేయులు, సంఘ విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొ న్నారు.



### చింతకుంట్ల గ్రామంలో..

కొండమల్లేపల్లి మండల పరిధిలోని చింతకుంట్ల గ్రామంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ కావటి వెంకటేష్ యాదవ్ జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ, ఉప సర్పంచ్ వార్డు సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



### మండల వనరుల కేంద్రంలో

మండల వనరుల కేంద్రం నేరేడు గొమ్ము లో మండల విద్యాధికారి టి బ్రహ్మచారి మాట్లాడారు. జిల్లాపరిషత్ ప్రధానోపాధ్యాయులు తులా శ్రీనివాసులు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మౌనిక రెడ్డి, ఎంఆర్ సి స్టాప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### కొండమల్లేపల్లి మండలంలో..

కొండమల్లేపల్లి పట్టణంతోపాటు పరిసర ప్రాంత గ్రామాలలో ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలలో మువ్వెన్నెల జెండా రెపరెపలాడింది. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, మండల ప్రజా పరిషత్ కార్యాలయం, స్థానిక పోలీస్ స్టేషన్, పిఎసిఎస్ కార్యాలయం, వ్యవసాయ శాఖ, పిహెచ్ సి, స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులు ప్రజాప్రతినిధులు జాతీయ జెండాను ఎగరవేశాలు. పట్టణ కేంద్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలతో పాటు, బీసీ ఎస్సీ ఎస్టీ గురుకుల పాఠశాలలో కూడా జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం 80 స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా అందరికీ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రతి ఒక్కరూ దేశ భక్తిని చాటుకున్నారు.



## రాజ్యాంగ పరిరక్షణకు పోరాటాలకు సిద్ధం కావాలి



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** స్వాతంత్ర్య పోరాట యోధుల స్ఫూర్తితో సామ్రాజ్యవాదానికి, మనువాదానికి వ్యతిరేకంగా, భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం, అన్ని రంగాల్లోనూ వనరుల్లో సమానత్వం, భూమి, ఉపాధి, మౌలిక వసతుల సాధన కోసం ప్రజలందరూ పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.సుందరయ్య భవన్‌లో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు అధ్యక్షతన స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం నున్నా నాగేశ్వరరావు మాట్లాడారు. 1947 ఆగస్టు 15న మన దేశం బ్రిటిష్ పాలన నుంచి విముక్తి పొందిందని, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం వంటి విలువలతో 1950 జనవరి 26న గణతంత్ర దేశంగా ఆవిర్భవించిందని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అనేక రంగాల్లో అభివృద్ధి సాధించినప్పటికీ, ఆకలి లేని సమాజం, భయం లేని జీవితం, వివక్ష లేని దేశం, అవినీతి లేని వ్యవస్థ వంటి లక్ష్యాలు ఇంకా పూర్తిగా సాధించలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. 80 ఏళ్ల స్వాతంత్ర్య దేశంలో ఇంకా అసమానతలు, అన్యాయం, దోపిడీ, పేదరికం, వర్గ-కుల-లింగ వివక్షలు ఎందుకు కొనసాగుతున్నాయని ఆయన ప్రశ్నించారు.ఆర్థిక, సామాజిక రంగాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తొలగలేదని తెలిపారు. భూమి, సంపద, వనరులు కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కావడం వల్లే సామాజిక అసమానతలు కొనసాగుతున్నాయని, పాలకులు మారినా సామాన్యుల సామాజిక-ఆర్థిక పరిస్థితుల్లో ఆశించిన మార్పు రాలేదన్నారు.1947 నుండి 2022 వరకు ఆర్ఎస్ఎస్, బీజేపీ కార్యాలయాలపై ఏ ఒక్కరోజైనా జాతీయ పతాకాన్ని ఎగురవేయలేదని విమర్శించారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనని, దేశం కోసం ప్రాణాలు అర్పించని ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులు ఇప్పుడు స్వాతంత్ర్యం తామే తెచ్చామంటూ అబద్ధపు నాటకాలు ఆడుతున్నారని ఘాటుగా వ్యాఖ్యానించారు. దేశంలో మోడీ 12 ఏళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరలేదని, మణిపూర్ ఘటనలు, ఢిల్లీ నీట్ పేపర్ లీకేజీ విద్యార్థుల ఆందోళనలు, రైతుల నిరసనలతో కేంద్ర ప్రభుత్వంపై ప్రజలలో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, రాబోయే రోజుల్లో మోడీ ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటు చేయడం ఖాయమని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాచర్ల భారతి, వై. విక్రమ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి పద్మ, మెరుగు సత్యనారాయణ, సీనియర్ నాయకులు బుగ్గవీటి సరళ, జిల్లా కమిటీ సభ్యులు పి. ఝాన్సీ, నందిపాటి మనోహర్, ఎస్.కే.వి.ఎ. మీరా, తుమ్మ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

### తుంగతుర్తి మండలంలో




**ముద్ర, తుంగతుర్తి :** తుంగతుర్తి మండల కేంద్రం తోబాటు మండలంలోని వివిధ గ్రామాలలో శనివారం ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు, ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించి దేశ స్వాతంత్రం రావడానికి మన దేశ నాయకులు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మందుల సామేలు, జూనియర్ సివిల్ కోర్టు లో జడ్జి మొహమ్మద్ గౌస్ పాషా, స్థానిక పోలీస్ స్టేషన్లో సీఐ ఉపేందర్ రావు, తాసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ దయానంద్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో చలపతి స్థానిక మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి పిఎసిఎస్ కార్యాలయంలో పిఎసిఎస్ చైర్మన్ గుడిపాటి సైదులు తుంగతుర్తి గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మల్లెపాక సాయిబాబు బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు తాటి కొండ సీతయ్య తో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అధికారులు, సర్పంచులు, రాజకీయ పార్టీల కార్యాలయాలు, సంఘాల ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు.

## మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**ముద్ర, తుంగతుర్తి:** తుంగతుర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో తమతో చదువుకున్న బాల్యమిత్రుడు మండల కేంద్రానికి చెందిన బొంకురి శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యానికి మరణించడంతో తాము అండగా ఉన్నామంటూ ముందుకు వచ్చి 75 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు (1986-87) పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఈ మేరకు శనివారం మరణించిన బాల్య మిత్రుడు ఇంటికి వెళ్లి ఆర్థిక సహాయం అందజేశారు, ఈ కార్యక్రమంలో బాల్య మిత్రులు ఎర్ర హరికృష్ణ, చిత్తలూరు యాదగిరి, కటకం వెంకన్న, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు

## స్మార్ట్ కార్డుల పేరుతో ప్రజా ధనం దుర్వినియోగం



**ముద్ర, తుంగతుర్తి :** రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అవసరం ఉన్న పథకాలను హామీ ఇచ్చిన పథకాలను అమలు చేయకుండా ఎలాంటి ఉపయోగం లేనటువంటి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణి చేస్తుందని మాజీ ఎంపీపీ బి ఆర్ ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు తాటికొండ సీతయ్య అన్నారు. శనివారం తుంగతుర్తి లోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ఇప్పటికే ఉన్న ఆహార భద్రత కార్డులతో రేషన్ ఇస్తున్నప్పటికి మరేం అవసరం వచ్చిందని స్మార్ట్ కార్డులు ఇస్తున్నారో ప్రభుత్వం జవాబు చెప్పాలని అన్నారు. ఆపేరుతో ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడమే నని అన్నారు.

## ప్రమాదంలో ప్రజాస్వామ్యం

**సిపిఐ కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణ**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం :** దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి పేర్కొన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జితేందర్రెడ్డి మాట్లాడుతూ 80 ఏళ్ల స్వాతంత్ర ఫలాలు అతికొద్ది మందికి మాత్రమే అందాయని అట్టడుగు పేదల దరికి పథకాలు చేరకపోవడం దురదృష్టకరమన్నారు. 12 ఏళ్ల మోడీ పాలనలో ప్రజాస్వామ్యానికి విఘాతం కలుగుతుందని, ప్రశ్నించే గొంతుకలను అణిచివేసే ప్రయత్నం జరుగుతుందన్నారు. ప్రశ్నించే తత్వం లేకుండా ప్రజాస్వామ్యం బతకదని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు పోరాటాలే శరణ్యమని జితేందర్రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు, అజ్మీర రామ్మూర్తి, పలువురు జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 16.08.2026
www.mudranews.in | @mudranews



**కీర దోసకాయతో జీర్ణ సమస్యలకు చెక్**

దోసకాయలో నీరు, పీచు అధికంగా ఉంటాయి. ఆహారంలో చేర్చుకోవడం వల్ల శరీరానికి హైడ్రేషన్‌తో పాటు జీర్ణక్రియకు మేలు జరుగుతుంది.



# ముువ్వన్నెల జెండా రెప రెపలు

### కోర్టులో జిల్లా జడ్జి నీలిమ ఖిల్లాపై ఎమ్మెల్యే రోహిత్ బీఆర్ఎస్, బీజేపీ కార్యాలయాల్లో వేడుకలు





**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లా వ్యాప్తంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా న్యాయస్థానముల సముదాయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. నీలిమ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఫస్ట్ అడిషనల్ డిస్టిక్ అండ్ సెషన్స్ జడ్జి ఆర్.ఎం. సుభవల్లి, జూనియర్ సివిల్ జడ్జ్ సిరి సౌజన్య, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ సాయి ప్రభాకర్, బార్ అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, జిల్లా కోర్టు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శారద, న్యాయవాదులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మున్సిపాలిటీ వద్ద చైర్ పర్సన్ కానుగు, రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద ఆర్డిఓ రమాదేవి, టౌన్ పోలీస్ స్టేషన్లో ఇన్స్పెక్టర్ మహేష్ జాతీయ జెండా ఎగరవేశారు. జాతీయ జెండా ఎగు రవేసిన ఎమ్మెల్యే రోహిత్మెదక్ చారిత్రాత్మక ఖిల్లా, రాందాస్ చౌరస్తా, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ జాతీయ జెండాను ఎగురవేశారు. రాందాస్ చౌరస్తాలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కానుక రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, పట్టణ పార్టీ అధ్యక్షులు మందుగుల గంగాధర్, మున్సిపల్ చైర్మన్లు టి. చంద్రపాల్, గూడూరు కృష్ణ, మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, మున్సిపల్ కౌన్సిలర్లు ఎండి మనస్సురాలి, శృతిసంతు, ఫాతిమా, అరుణ, సిద్ధిరాములు, హరిత నర్సింగ్ రావు, కాంగ్రెస్ నాయకులు బొజ్జ. పవన్, కో ఆప్షన్ సభ్యులు ఎండి తహెర్, అనూష, గ మ్యాడం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో...బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి త్రివర్ణ పతాకాన్ని ఎగు రవేశారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ళ శశిధర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మెన్ లు ఆరేళ్ళ మల్లిఖార్జున్ గౌడ్, బట్టి జగపతి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ లు ఆకిరెడ్డి క్రిష్ణారెడ్డి, గంగా నరేందర్, న్యాయవాది జీవన్ రావు, మెదక్ బిఆర్ఎస్ పార్టీ పట్టణ కన్వీనర్ గడ్డమీది క్రిష్ణా గౌడ్, కౌన్సిలర్ లు మామిండ్ల ఆంజనేయులు, జుబేర్ అహ్మద్, మాయా గంగమణి మల్లేశం, మ్యాదరి దీపక్ కుమార్, ఖాజా సోహేల్, సాయి, మాజీ కౌన్సిలర్ లు , కిషోర్, ఆర్.కె. శ్రీనివాస్, నాయకులు ప్రభురెడ్డి, లింగారెడ్డి, సయ్యద్ సాదిక్ అలీ తదితరులు పాల్గొన్నారు.బీజేపీ కార్యాలయంలో...భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ జిల్లా కార్యాలయం వద్ద జాతీయ జెండా ఎగర వేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు ఈర్ల రంజిత్ రెడ్డి, సంగసాని సురేష్, పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, మాజీ జడ్పీటీసీ పంజా విజయ్ కుమార్, ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడ్డం కాశీనాథ్, మోర్చా జిల్లా అధ్యక్షులు వడ్ల జనార్దన్, బైండ్ల సత్యనారాయణ, రాములు నాయక్, ఖీచి జ్ఞాన్ సింగ్, జిల్లా పదధి కారులు సంగీత, మండల అధ్యక్షులు సంతోష్ చారి, కౌన్సిలర్లు, అఖిలభారత్, రాజమణి లక్ష్మణ్, సీనియర్ నాయకులు సుభాష్ గౌడ్, లోకేష్, అల్లం మధు, మండల, పట్టణ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు










### జాతీయ జెండా ఎగురవేసిన కలెక్టర్ ప్రతిమా

**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ సమీకృత అధికారుల సముదాయం (కలెక్టరేట్) లో 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. వందేమాతరం, జనగణమన ఆలపించారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎందరో మహనీయులు, స్వాతంత్ర్య సమర యోధులు తమ ప్రాణాలను త్యాగం చేశారని తెలిపారు. డిఆర్వో అంబదాస్ రాజేశ్వర్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.జెండా ఎగురవేసిన ఏఎస్పీ జిల్లా పోలీస్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ జాతీయ జెండాను ఎగురవేశారు. అత్యవసర, క్లిష్ట పరిస్థితుల్లో పోలీసు సిబ్బంది రెస్క్యూ టీమ్‌లా ముందుండి ప్రజలకు అండగా నిలుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్న కుమార్, సుభాష్ చంద్రబోస్, ఇన్‌స్పెక్టర్లు మహేష్, రాజశేఖర్ రెడ్డి, కృష్ణమూర్తి, సందీప్ రెడ్డి, ఆర్ఐలు శైలేందర్, రామకృష్ణ, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు**

మెదక్ జిల్లా కేంద్రంలో పోలీస్ పరేడ్ గ్రౌండ్లో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పండుగ వాతావ రణంలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రద ర్శనలు ఆహుతులను అలరింపజేశాయి. ఎదనిండా దేశ భక్తిని నింపుకుని జాతీయ స్ఫూర్తి పెంపొందేలా ఆకట్టుకునే రీతిలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. చిన్నారులను ముఖ్య అతిథి మంత్రి డా.వివేక్ వెంకట స్వామి అభినందించారు. జ్ఞాపికలతో సత్కరించారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని తెలిపేలా ఏర్పాటు చేసిన స్టాళ్లను ఏర్పాటు చేశారు. కలెక్టర్ ప్రతిమా సింగ్, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, మెదక్ ఆర్డీవో రమాదేవి ప్రజా ప్రతినిధులు, అధి కారులు, సిబ్బంది, స్వాతంత్ర్య సమర యోధులు, ప్రజలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

**ప్రశంసా పత్రాలు అందజేసిన మంత్రి వివేక్**

మెదక్ పరేడ్ గ్రౌండ్లో నిర్వహించిన వేడు కలలో జిల్లాలో ఉత్తమ సేవలందించిన అధి కారులు, సిబ్బందికి ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి ప్రశంసా పత్రాలు అందజేసి అభినం దించారు. ఏఎస్పి విక్రాంత్ కుమార్ సింగ్, జిల్లా అధికారులు డిఆర్డిఓ శ్రీనివాసరావు, హేమ భార్గవి, దేవకుమార్,సందీప్, ఆర్డీఓలు రమాదేవి, రామకృష్ణ, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్ తోపాటు పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య ఇతర శాఖల అధికారులకు సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎమ్మెల్యే డాక్టర్ రోహిత్, ఎస్పీ శ్రీనివాస్ రావు ఉన్నారు.



**'వనదుర్గ'కు ముువ్వన్నెల హారతి**

**స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ ఏడుపాయల వన దుర్గ మాత అమ్మవారిని ముువ్వన్నెలు మూడు రంగుల పుష్పాలతో అలంకరించారు.**

**- ముద్ర ప్రతినిధి, మెదక్**

## మూడేళ్ల క్రితం చోరీ కేసులో దొంగను పట్టించిన చీర



**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** మూడు సంవత్సరాల క్రితం ఇంట్లో చోరీ చేసిన దొంగను చీర పట్టించింది. ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.... బండ్లగూడ జాగిర్ మున్సిపల్ పరిధిలో వినాయక నగర్లో యాదయ్య తన భార్య పిల్లలతో నివాసం ఉంటున్నారు. 2023 సెప్టెంబర్ 16న యాదయ్య అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరాడు. మురళి తర్వాత 19వ తేదీ ఇంటికి శాఖ ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే ఇటీవల యాదయ్య ఇంటి వెనుక ఉండే స్వప్న (29) ఓ శుభకా ర్యానికి వెళ్ళింది. ఆమె కట్టుకున్న చీర గమనించిన యాదయ్య భార్య ఆ చీర తనదేనని పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు స్వప్నను విచారించగా మొదట ఆ చీర తనదేనని బుకాయించింది. ఆ తర్వాత యాదయ్య ఇంట్లో చోరీ చేసినట్లు స్వప్న, ఆమె భర్త రాములు ఇద్దరు ఒప్పుకున్నారు. ఆ సమయంలో బంగారు నగలతో పాటు రెండు లక్షల 50 వేల నగదు, కొన్ని చీరలు వెతుకుపోయినట్లు పోలీసు విచారణలో ఒప్పుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేత

**ముద్ర, మోటకొండూరు :** మోటకొండూరు మండలం చందేపల్లి గ్రామానికి చెందిన దాత రాగిరి రితీష్ తన ఉదారతను చాటుకున్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆయన తన సొంత ఖర్చులతో స్పోర్ట్స్ యూనిఫామ్స్‌ను ఉచితంగా బహుకరించారు.

## దేశ సమైక్యతే బలం.. యువతే దేశ భవిష్యత్తు



**ముద్ర , హైదరాబాద్ :** దేశ సమైక్యత, సార్వభౌమత్వ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని అశ్విన్ డయాగ్నొస్టిక్ సెంటర్ సీఈవో, మల్కాజిగిరి ప్రింట్ మీడియా కోఆప రేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు గిరి గడ్డమీది పిలుపునిచ్చారు. కేశవ్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఈశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో నేరేడ్‌మెట్ ఓల్డ్ పోలీస్‌స్టేషన్ చౌరస్తాలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో ప్రముఖ సీనియర్ భాజపా నాయకుడు, మాజీ వైస్ చైర్మన్ ఎం. బాలలింగం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అశ్విన్ డయాగ్నొస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. కేశవ్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు అమర్, వినోద్, శ్రీనివాస్, అశ్విన్ డయాగ్నొస్టిక్ సెంటర్ సిబ్బంది శివ గడ్డమీది, అర్జున్, అరుణ్, సునీత, స్రవంతి, భాను, వైద్యులు డా. రోహన్, డా. చెంగలి రేఖ, డా. హర్షవర్ధన్, అశ్విన్ గడ్డమీది, ఆర్యన్, క్లింకార, హరియాంష్, శ్రీతన్వి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యాలయంలో..



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** సంజీవరెడ్డి భవన్ లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. కార్యక్రమంలో అర్బన్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి,శాసనమండలి మాజీ సభ్యులు బాలసాని లక్ష్మీ నారాయణ , శాసనసభ మాజీ సభ్యులు కొండబాల కోటేశ్వరరావు,రాష్ట్ర గిడ్డంగుల గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పులిపాటి వెంకయ్య, జిల్లా ఐ యన్ టి యు సి అధ్యక్షులు కొత్తా సీతారాములు,జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సయ్యద్ గౌస్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మొక్క శేఖర్ గౌడ్, సయ్యద్ ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

## వినికిడి యంత్రం అందజేసిన డిప్యూటీ సీఎం



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం :** నాయకత్వం అంటే ప్రజల కష్టాల్లో తోడుగా నిలవడమేనని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నిరూపించారు. ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గం స్టేజి పినపాక గ్రామానికి చెందిన 16 ఏళ్ల లక్ష్మి మనీష్ పుట్టుకతోనే వినికిడి సమస్యతో బాధపడుతున్నాడు. బాలుడికి రూ. 6 లక్షల విలువైన హియరింగ్ మెషిన్ అవసరమని వైద్యులు తెలపడంతో, ఆర్థిక స్తోమత లేని ఆ పేద కుటుంబం డిప్యూటీ సీఎంను ఆశ్రయించింది. వారి పరిస్థితిపై తక్షణమే స్పందించిన భట్టి విక్రమార్క, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆ యంత్రాన్ని బాలుడికి స్వయంగా అందజేశారు. తనకు సహాయం చేసిన డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతగా లక్ష్మి మనీష్ తన చేత్తో గీసిన భట్టి విక్రమార్క పెన్సిల్ ఆర్ట్ చిత్రాన్ని కానుకగా ఇచ్చాడు. ఆ చిత్రాన్ని అందుకున్న ఉప ముఖ్యమంత్రి భావోద్వేగానికి గురై బాలుడిని ఆప్యాయంగా కౌగిలించుకున్నారు.

**బీజేపీ కార్యాలయంలో..**



బిజెపి జిల్లా కార్యాలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఆవిష్క రించారు.దేశ స్వేచ్ఛ కోసం ప్రాణాల ర్పించిన సమరయోధుల త్యాగాలను నాయకులు కొనియాడారు. 'వందే మాతరం' ఆలపించి దేశభక్తిని చాటారు.ఎనిమిది దశాబ్దాల్లో వ్యవసాయం, అంతరిక్షం, రక్షణ రంగాల్లో భారత్ సాధించిన పురోగతిని గుర్తుచేశారు. దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.ఈ వేడుకల్లో సన్నె ఉదయ్ ప్రతాప్, దొంగల సత్యనారాయణ, శ్యామ్ రాథోడ్, పమ్మి అనిత, మందా సరస్వతి నాయకులు పాల్గొన్నారు.

## వెలువర్తిలో మహా రక్తదాన శిబిరం

**ముద్ర, వలిగొండ :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వెలువర్తి గ్రామంలో వెలువర్తి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా శనివారం మహా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథులుగా రామన్నపేట సీఐ రవి, స్థానిక ఎంపీడీవో జలంధర్ రెడ్డి, ఎస్సై శ్రీకాంత్ రెడ్డి లు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు.

## అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు

**తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయక త్వంలోని ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందించడంతో పాటు పేదలకు నాణ్యమైన సన్నబియ్యం అందిస్తోందని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు.శనివారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్,రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, గ్రంధాలయ చైర్మన్ అవేజ్ చిస్తి,మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి తో కలసి తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి స్మార్ట్ రేషన్ కారులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు భద్రత తో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులు మరింత పారదర్శకంగా, అవకతవకలకు తావు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు క్యూఆర్ కోడ్ భద్రతతో కూడిన ట్యాంపర్ ప్రూఫ్ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో 2,51,513 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ రంగాలకు భారీగా నిధులను మంజూరు చేస్తున్నది. ఏప్రిల్-2025 మాసము నుండి అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మొత్తం 5034 టన్నులకు గాను కిలోకు రూ.49.11 పైసలు చొప్పున మొత్తం రూ.24,73,20,420 ప్రభుత్వం నిధులు వినియోగిస్తుందన్నారు. ఆగస్ట్, సెప్టెంబర్, అక్టోబర్ 2026 మూడు నెలలకు గాను ఒకేసారి రేషన్ పంపిణీ చేయుటకై 15,104 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం కేటాయించడం జరిగిందన్నారు. దీనికిగాను మొత్తం రూ.74,19,61,260 ప్రభుత్వం నిధులు వినియోగిస్తుందన్నారు. రైతులకు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రెండు వందల యూనిట్ల వరకు ఉచిత కరంటు, సబ్సిడీ గ్యాస్ సిలెండర్, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రె, కలెక్టర్ అనురాగ్ జయంతి, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబురావు, మున్సిపల్ వైస్ చైర్మన్ మంజుల,ఆర్డీవోలు కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి,జిల్లా పౌర సరఫరాల అధికారి రోజారాణి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg. No. TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555